
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

గురువారం 12 డిసెంబరు 2024



చిలకలూరిపేట మేజర్ కాలువ

ఎట్టకేలకు ఎన్నికలు

- సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం
- 14న నీటి సంఘాలకు.. 17న డీసీలకు ఓటింగ్
- ఏర్పాట్లలో అధికారులు.. నాయకుల సమాయత్తం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో ఊసెత్తని.. కూటమి ప్రభుత్వ హయాంలో రెండు సార్లు వాయిదా పడిన.. సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదలైంది. గ్రామాల్లో ఒక వైపు రైతులు వరి కోతల హడావుడిలో ఉండగా మరోవైపు ఎన్నికల సమరానికి తెరలేచింది. దీంతో పల్లెల్లో నీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది. ఈ నెల 14న నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ)కు, 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల(డీసీ)కు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిర్వహణకు జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను అధికారులు ఇప్పటికే కోరారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వాయిదాల అనంతరం ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదలతో రాజకీయ పార్టీలకు చెందిన గ్రామ నాయకులు ఎన్నికలపై దృష్టి సారించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బందికి శిక్షణను పూర్తి చేశారు. ఎన్నికల సామగ్రిని కూడా సిద్ధం చేశారు. ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించింది. సేవా భావం కలిగిన వారిని నీటి సంఘాలకు ఎన్నుకోవాలని ఇప్పటికే కూటమి నేతలు పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలపై వైసీపీ దృష్టి సారించిన దాఖలాలు లేవు.

సాగర్ పరిధిలో 274 నీటి సంఘాలు

నాగార్జున సాగర్ కుడి కాల్వ పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్‌లో 274 సాగు నీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో 12 టీసీల చొప్పున మొత్తం 2,628 టీసీలు ఉన్నాయి. టీసీల వారీగా ఓటర్ల జాబితాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. ఒక్కొక్క టీసీ పరిధిలో 2,500 నుంచి 3,000 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు. టీసీలకు 14న ఎన్నికలు జరగనుండగా అదే రోజున సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే ప్రాజెక్టు కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించాల్సి ఉంది. కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామ్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.



- గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు
- గమ్యస్థానం చేరే సమయంపై అయోమయం
- రోజువారీ ప్రయాణికులు, ఉద్యోగులు పడరానిపాట్లు
- ఇష్టారాజ్యంగా రైళ్ల రద్దు.. అరకొర రైళ్లపై తీవ్ర ఒత్తిడి



రైలు ప్రయాణం నరకం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడు వస్తాయో తెలియదు.. ఎప్పుడు బయలుదేరతాయో అర్థం కాదు.. ఇదీ ప్రస్తుతం రైళ్ల పరిస్థితి. గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు.. ఆ రైళ్లలో ఎక్కి ఎప్పటికి గమ్యస్థానానికి చేరుతామో తెలియదు.. ఇదీ ప్రయాణికుల కష్టాలు. ఇష్టం వచ్చినట్లు రైళ్లను రద్దు చేస్తున్నారు.. అయినా రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం. ఒకప్పుడు సమయానికి వచ్చి సమయానికి గమ్యస్థానాలకు చేర్చుతూ ప్రయాణికుల ఆదరణను పలు రైళ్లు పొందాయి. అయితే గత కొంతకాలంగా రైళ్ల రాక.. పోక అనేది ఎవరికీ తెలియడంలేదు. రైల్వే అధికారులు కూడా రైళ్ల రాకపోకల గురించి చెప్పలేకపోతున్నారు. తాను ఎక్కబోయే రైలు జీవితకాలం లేటు అన్న నానుడిని నిజం చేసేలా ప్రస్తుతం రైలు ప్రయాణం మారింది. రైలులో ప్రయాణం అంటే కోరుకుని నరకానికి ప్రయాణం కట్టినట్లే అన్నట్లుగా మారింది పరిస్థితి. సీజన్‌పై రోజువారీ ప్రయాణాలు చేసే ఉద్యోగులు, విద్యార్థుల పరిస్థితి గురించి చెప్పాలంటే అది నిత్య నరకమే. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ, బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, చీరాల, రేపల్లె రూట్లలో నడిచే రైళ్లు, పక్క జిల్లాల్లోని విజయవాడ, నరసాపురం రూట్లలో నడిచే రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్నాయి.

పదుల కిలోమీటర్లు.. గంటల ప్రయాణం

గుంటూరు నుంచి విజయవాడ మధ్య దూరం 30 కి.మీ. కాగా అందుకోసం 2 నుంచి 3 గంటల సమయం పడుతున్నది. 120 కి.మీ దూరం ఉన్న గుంటూరు- మాచర్ల మధ్య ప్రయాణం 4 నుంచి 6 గంటల సమయం పడుతోంది. సాయంత్రం 7.35కు గుంటూరు చేరుకోవాల్సిన మాచర్ల రైలు ఈ వారంలో రెండు రోజులు రాత్రి 10.30 వరకూ గుంటూరుకు రాలేదు. ఒకటి రెండు రోజులు మినహా మిగిలిన అన్ని రోజులూ ఆ రైలు ఆలస్యంగా వస్తోంది. దీంతో ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. హుబ్లీ రైలు ఈ నెల 6న రాక, పోకలు రెండూ ఐదు గంటలు ఆలస్యంగా సాగాయి. గుంటూరు- విజయవాడల మధ్య తిరిగే ఇంటర్‌సిటీ మెమూ రైళ్లు రెండు మూడు గంటల సగటు జాప్యంతో తిరుగుతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా 30 కి.మీ ప్రయాణానికి ఈ రైళ్లు 4 గంటల సమయం తీసుకుంటున్నాయి. ఉదయం 11.30కి గుంటూరులో బయలుదేరి

(మిగతా 8వ పేజీలో)



గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

- నాడు-నేడు పేరు మార్పుతో సరి
- పాఠశాలల్లో పునః ప్రారంభంకాని పనులు
- పాడైపోతున్న నిర్మాణ సామగ్రి.. ప్రజాధనం వృథా
- అటకెక్కిన అభివృద్ధి పనులపై దృష్టి సారించని పాలకులు
- నిధులు విడుదల కాక గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా పనులు

గుంటూరు కేవీపీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

ఆరునెలలైనా.. అసంపూర్తిగానే

ప్రభుత్వ పాఠశాలలను నాడు- నేడు పేరుతో తీర్చిదిద్దుతున్నామన్నారు.. కార్పొరేట్ పాఠశాలకంటే మిన్నగా మారుస్తామన్నారు.. తొమ్మిది రకాలు పనులు చేపట్టారు.. వందల్లో పాఠశాలలను ఎంపిక చేసి రూ.కోట్లలో నిధులు మంజూరు చేశారు.. ఉన్న భవనాలను పడగొట్టారు.. అయితే నిధులు విడుదల చేయకుండా పాఠశాలలను గత పాలకులు పాడుబెట్టారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల దుస్థితిని చూసి, వాటిని సరిదిద్దేందుకు సంకల్పించింది. తొలుత నాడు-నేడు పేరును మనబడి మన భవిష్యత్తుగా మార్చింది. దీంతో అటకెక్కిన పనులు ప్రారంభమవుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు కూడా భావించారు. కానీ ఆరు నెలలుగా అసంపూర్తిగానే పనులు ఉన్నాయి.

గుంటూరు(విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం గత ప్రభుత్వం నాడు నేడు పథకం పేరుతో ప్రారంభించి వదిలేసిన పనులు ఇప్పటికీ అనేక చోట్లు అలాగే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం పథకం పేరును మార్చడంతో సరిపెట్టిందే కానీ పనుల పునః ప్రారంభంపై దృష్టి సారించలేదు. పనులపై రాష్ట్రస్థాయిలో సమీక్ష నిర్వహించక పోవడంతో జిల్లా స్థాయిలో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా నిర్మాణ సామగ్రి అనేక చోట్లు పాడైపోతోంది. కొన్ని చోట్ల దొంగల పాలౌతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

పెండింగ్‌లోనే అభివృద్ధి పనులు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ప్రభుత్వం నాడు నేడు పేరుతో చేపట్టిన పనులు ప్రభుత్వం మారినా ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, తాగునీటి కోసం వాటర్ ప్లాంట్స్, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబులు, కిచెన్‌షెడ్లు, సైన్స్ ల్యాబుల నిర్మాణం, విద్యార్థులు, సిబ్బందికి ఫర్నిచర్ సౌకర్యం, రంగులు వేయడం తదితర తొమ్మిది రకాల పనుల్ని చేపట్టగా ఆయా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. గత ప్రభుత్వం నాడు నేడు పథకంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2 వేలకుపైగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు జడ్పీ పాఠశాలల్ని ఎంపిక చేసి దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు చేసింది. కానీ నిధుల విడుదల మాత్రం 40 శాతం కూడా చేయలేదు. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటికీ 45 శాతంపై పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. వందల సంఖ్యలో భవన నిర్మాణ పనులు ఇంకా వివిధ దశల్లోనే ఉన్నాయి. కొన్ని చోట్ల పునాదుల స్థాయిలో మరికొన్ని చోట్ల శ్లాబ్ పూర్తి అయినా పార్టీషన్, ప్లాస్టింగ్, విద్యుత్, ప్లంబింగ్ పనులు పూర్తికాలేదు. నిర్మాణ సామగ్రి అనేక చోట్ల పాడైపోతోంది. ఇసుక, కంకర, డస్ట్ ఇప్పటికే అనేక పాఠశాలల్లో మట్టిలో కలిసిపోయింది. సిమెంట్‌కు రక్షణ లేకపోవడంతో గడ్డకట్టి ఉపయోగించడానికి వీలులేకుండా మారింది. శానిటరీ, ప్లంబింగ్, విద్యుత్ పరికరాలు తరగతి గదుల్లో పేరుకుని పోయి ఉన్నాయి. కొన్ని ఇప్పటికే ధ్వంసం కాగా, మరికొన్ని దొంగలపాలైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాగా మారిందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అనేక పాఠశాలల్లో తాగునీటి పథకాల ఏర్పాటు చేసినా వినియోగంలోకి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అసంపూర్తి పనులపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



గుంటూరులోని ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో గడ్డకట్టి పాడైపోయిన సిమెంట్ బస్తాలు

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు
రెండు రోజుల జాతీయ సదస్సులో ఏఎన్‌యూ ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు
6

నీ భర్తను చంపకుంటే.. నిన్ను చంపేస్తా
● వెంగళాయపాలెం వైసీపీ నాయకుడి ఉన్మాద చర్యలు

మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే
● కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్
8

ఫాతిమా మాకొద్దు

- తూర్పు వైసీపీలో ఇన్‌చార్జిపై తిరుగుబాటు
- సుబ్బారెడ్డిని కలిసిన తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు
- ఆమెను మార్చకుంటే పార్టీని వీడతామని హెచ్చరికలు

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒంటెద్దు పోకడలతో విసిగిపోయాం.. ఓటమి తర్వాత కూడా ఆమె తీరు ఏమాత్రం మారలేదు.. ఇప్పటికే పలువురు పార్టీకి దూరమయ్యారు.. ఆమెను మార్చకుంటే మేము కూడా పార్టీని వీడతాం.. నూరిఫాతిమా మాకొద్దు అంటూ గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ కార్పొరేటర్లు బుధవారం వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కూడా కలిసి నూరిఫాతిమాను మార్చాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. గత ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలైన షేక్ నూరిఫాతిమా తూర్పు ఇన్‌చార్జిగా ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ముస్తఫాపై తీవ్ర వ్యతిరేకతతో ఆయన్ను తప్పించి ఆయన కుమార్తె ఫాతిమాకే సీటు ఇవ్వడంపై అప్పట్లోనే నిరసన వ్యక్తమైంది. అప్పట్లోనే డిప్యూటీ మేయర్ సజీల వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. తూర్పులో వైసీపీ కార్పొరేటర్లు 23 మంది ఉండగా అందులో పది మంది ఇప్పటికే పార్టీని వీడారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా ఆమెను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పించాలనే డిమాండ్ తీవ్రతరమైంది. జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డిని పలువురు కార్పొరేటర్లు కలిసి ఆమెను తప్పించాలని ఇటీవల డిమాండ్ చేశారు.



వైవీ సుబ్బారెడ్డిని కలిసిన తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు

కలెక్టర్లకు దిశానిర్దేశం

- పలు అంశాలపై సమీక్ష.. ఫలితాలపై చర్చ
- వ్యవసాయ, అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి
- తొలిరోజు సదస్సులో కలెక్టర్లకు ముఖ్యమంత్రి సూచన
- ఆర్టీజీఎస్‌లో ప్రథమ స్థానం.. గుంటూరు కలెక్టర్‌కు అభినందనలు



సదస్సుకు హాజరైన గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తే ఫలితాలు బాగుంటాయి.. ఆయా రంగాల పురోగతిపై దృష్టి పెట్టాలి.. అని కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్ల రెండో సదస్సు బుధవారం రాజధాని అమరావతి సచివాలయంలో ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సుకు గుంటూరు, పల్నాడు, బాపట్ల కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు, వెంకటమురళిలు హాజరయ్యారు. ఈ క్రమంలో తొలి రోజు సదస్సులో మూడు జిల్లాలకు సంబంధించిన వివిధ అంశాలు, విభాగాల వారీగా ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ ఆరు నెలల వ్యవధిలో సాధించిన ఫలితాలపైన, జిల్లా గణాంకాలను సదస్సులో ప్రస్తావించి వాటిపై సమగ్రంగా చర్చించారు.

వ్యవసాయంలో వెనుకబాటు..

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో గుంటూరు జిల్లా వెనుకబడిందని, రాష్ట్ర వ్యాప్తంగా చూసుకుంటే 22వ స్థానంలో ఉన్నదని ఈ రంగంపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వ శాఖల సెక్రటరీలు కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించి జీవీఏలో గుంటూరు కేవలం రూ.9566 కోట్లు మాత్రమే సాధించింది. పారిశ్రామిక రంగంలో రూ.13,655 కోట్ల జీవీఏతో ఏడో ర్యాంకు, సర్వీసు సెక్టార్‌లో రూ.31,591 కోట్లతో మూడో ర్యాంకు సాధించింది. జీడీడీపీ(గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్టు) ప్రస్తుత ధరలను బట్టి 2028-29 నాటికి రూ.1,31,705 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఐటీ, పర్యాటకం, షాపింగ్, హోటళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్(రియల్ టైం గవర్నెన్స్ సిస్టమ్)లో గుంటూరు జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు అభినందించారు. 85 శాతం భవన నిర్మాణాలు పూర్తి కాగా వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే డేటాలో 2,65,934 మంది మిస్సింగ్ అయ్యారని, వారిని గుర్తించాలని ఆదేశించారు. సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ విషయంలో 14.6 శాతం మందికి ఇళ్ల వద్ద ఇవ్వడం లేదని సర్వేలో తేలింది. 5.7 శాతం మంది వద్ద సచివాలయాల సెక్రటరీలు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్ ఎక్కువగా దృష్టి పెట్టి పింఛన్‌దారులు 100 శాతం సంతృప్తి వ్యక్తం చేసేలా చూడాలని ఆదేశించారు. అన్నక్యాంటీన్ల విషయంలో పారిశుధ్యం బాగోలేదని 8 శాతం, పర్వాలేదని 40 శాతం మంది చెప్పారు. టైంకి భోజనం పెడుతున్నారని 100 శాతం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా అన్న క్యాంటీన్లలో పారిశుధ్యం, పరిశుభ్రత మెరుగుపరిచేలా చూడాలన్నారు.

కృత్రిమ మేధ ద్వారా విస్తృత పరిశోధనలు



సావనీరు పుస్తకం ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో 'మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ప్రారంభ సభకు ఇంఛార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మారుతున్న ఆహార అలవాట్ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటిని ప్రజలకు తెలియపరచడంలో ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. ముఖ్యవక్తగా పాల్గొన్న మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో ఉన్న మంగళయాటన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జన్యు క్రమ లోపాల వల్ల కలిగే రుగ్మతలను ఆధునిక పద్ధతుల ద్వారా చికిత్స చేయవచ్చునని పేర్కొన్నారు. భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఐ. బాలకృష్ణ మాట్లాడుతూ సాంకేతికత వల్ల కలుగుతున్న దుష్ప్రయోజనాలను వివరించారు. బెంగళూరులోని ఆల్ అమీన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎండీ సలాహుద్దీన్ డీప్ లెర్నింగ్ మిషన్, లెర్నింగ్ అల్గారిజమ్ ఉపయోగించి ఔషధ లక్ష్యాలను గుర్తించడం, దానికి అనుగుణంగా ఔషధాలను కనుగొనడంలో ఏఐ ముఖ్యమైన భాగంగా మారిందని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల నుంచి 800 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కేసీరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ కో స్పాన్సర్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.ప్రమీలారాణి అధ్యక్షత వహించారు. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, కో కన్వీనర్ డాక్టర్ అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.సుజన, కోశాధికారి డాక్టర్ కేతు ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.మస్తానమ్మ, కె.విజయ్ కిషోర్, తెనాలిలోని ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు

- ఈ ఘనత సీఎం చంద్రబాబుదే
- జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకోరు
- ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి గత ఆర్నెలల్లో రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు రానున్నాయని, ఈ ఘనత సీఎం చంద్రబాబుదేనని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పోరుబాటను ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదనీ, జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుంటే రానున్న రోజుల్లో కనీసం ప్రతిపక్ష హోదా అయినా లభిస్తుందని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకొని అప్పులపాలు చేశారనీ, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెలల్లోనే గత ప్రభుత్వ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నారా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. డిప్యూటి సీఎం పవన్ కల్యాణ్ సారథ్యంలో రూ. 4500 కోట్లతో 13 వేల గ్రామాల్లో 30 వేల అభివృద్ధి పనులు సంక్రాంతి నాటికి పూర్తి చేయబోతున్నామని వివరించారు. ఒకేసారి రూ.4 వేలు పింఛన్ పెంచిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. రూ.15 వేల కోట్లతో రాజధాని అభివృద్ధి, రూ.12 వేల కోట్లతో పోలవరం అభివృద్ధికి నిధులు తెచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో 198 అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదల ఆకలి తీరుస్తున్నామని, 50 లక్షల మందికి దీపం పథకం ద్వారా సిలిండర్లు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గతంలో నాసిరకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలు గాలిలో కలిశాయని, నేడు చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మద్యం పాలసీ ద్వారా అతితక్కువ ధరకే నాణ్యమైన మద్యం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో 16 వేలకు పైగా నిరుద్యోగులకు డీఎస్సీ 6100 పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా నేడు అడుగులు వేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి ఓర్చుకోలేక పోతున్నారని విమర్శించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య, ప్రముఖ న్యాయవాది, బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు పోట్లూరి సైదారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, వీవీ సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నాం..

కె.నాగబాబుకు మంత్రి పదవి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. అదేవిధంగా ఆర్.కృష్ణయ్య, సాన సతీష్, బీద మస్తాన్‌కు రాజ్యసభ సీట్లు కేటాయించి గౌరవించడం అభినందనీయమని తెలిపారు.

లండన్ టు అమరావతి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావు, వర్సిటీ అధికారులు

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ గుజ్జు చెన్నారెడ్డి రచించిన లండన్ టు అమరావతి నవలను బుధవారం ఇంఛార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చెన్నారెడ్డి తన రచనల ద్వారా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కీర్తిని విశ్వవ్యాప్తం చేస్తున్నారని అభినందించారు. ఇటువంటి రచనలు సమాజ సోపానాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. రచనల్లోని సాహిత్యం నేటి తరానికి ఎంతో దోహదపడుతుందని సూచించారు. పుస్తక పఠనంలో ఉన్న మక్కువ సాహిత్య రచనలో చూపినట్లయితే విలువైన సాహిత్య సంపద సృష్టించవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి సాహిత్య రచనలు ఆహ్వానించ తగినవని పేర్కొంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంఛార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి మాట్లాడుతూ బోధన, పరిశోధనలతోపాటు సాహిత్యం పట్ల చెన్నారెడ్డి చూపిస్తున్న మక్కువ ప్రశంసనీయమని కొనియాడారు. ఇంఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ప్రిన్సిపాల్స్ ఆచార్య సురేష్ కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య జాన్సన్, ఆచార్య ప్రమీలారాణి మాట్లాడుతూ చెన్నారెడ్డి సాహిత్య రచన ఎంతో ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక రచయిత ఆచార్య చెన్నారెడ్డి మాట్లాడుతూ తన లండన్ టు అమరావతి నవల నేపథ్యాన్ని వివరించారు. పుస్తక రచనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, రూస కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ఆర్ ఆంజనేయులు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ఆచార్య పి .పద్మావతి, హెచ్ఆర్ఎం విభాగాధిపతి డాక్టర్ బి.నాగరాజు, జర్నలిజం ఇంఛార్జి కోఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధికి సీఎం నూతన పాలసీ



సూర్యలంక తీరంను పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజి

బాపట్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని టూరిజంను అభివృద్ధి చేసేందుకు నూతన పాలసీని ప్రవేశపెట్టారని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బాలాజి తెలిపారు. బుధవారం బాపట్ల సూర్యలంక సముద్ర తీరాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టూరిజం అంటే దేశంలోనే అగ్రగామి టూరిజంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి నూతన పాలసీని ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో టూరిజం ప్రదేశాలను పెంచటం ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తుందన్నారు. టూరిజం అభివృద్ధి వలన రాష్ట్ర ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే సూర్యలంక తీరాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సూర్యలంక తీరంలో అద్భుతమైన పరిస్థితులు ఉన్నాయనీ, చాలా పెద్దబీచ్ అని దీనిని మరికొంత అభివృద్ధి చేసుకుంటే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో విశాఖబీచ్ తర్వాత బాపట్లబీచ్‌కి మంచి పేరు ఉందన్నారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులను తీసుకొని అభివృద్ధి చేసే విషయంలో గండికోట, అఖండగోదావరి సెంటర్‌లను తీసుకున్నప్పటికీ రెండో ఫేజ్‌లో బాపట్ల బీచ్‌ను కూడా తీసుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రాజధానిలకు సూర్యలంకబీచ్ ఎంతో దగ్గరగా ఉందన్నారు. సూర్యలంక వద్ద ఉన్న స్టయిట్ రోడ్డు మీద కూడా షాపులను ఏర్పాటు చేయనున్నామనీ, తద్వారా షాపింగ్ చేసే పర్యాటకులకు నేరుగా బీచ్ కన్పిస్తుందన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం కైవశం



కాంస్య పతకం సాధించిన కోటేశ్వర్

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన సందు కోటేశ్వర్ రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కాకినాడలో నవంబరు 6 నుంచి 9 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 11 విభాగంలో కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి మూడు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. కాగా డిసెంబరు 5 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ కర్ణాటకలోని మైసూర్‌లో ఏపీ నుంచి అండర్ -11 విభాగంలో రింక్-2 (500+డి) పోటీల్లో ఉండవల్లికి చెందిన కోటేశ్వర్ కాంస్యపతకం సాధించి పలువురి మన్ననలు అందుకున్నారు.

వాగులో పడి యువకుడు మృతి



హరీష్ (ఫైల్)

కొత్తలూరు (శావల్యాపురం) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెలు మేపుకునేందుకు వెళ్లిన యువకుడు కాలు జారి వాగులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తలూరు గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దావులూరి ప్రసాదు కుమారుడు దావులూరి హరీష్(26) ప్రతిరోజూ గేదెలను మేపుకునేందుకు పొలానికి వెళ్తుంటాడు. అదే క్రమంలో బుధవారం ఉప్పరపాలెంకు వెళ్లే దారిలో అంగలేరు వాగు వైపున్న పొలాలకు గేదెలను తోలుకెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నీరు తాగేందుకు వాగులోకి దిగుతుండగా, కాలుజారి వాగులో పడిపోయాడు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో బయటకు రాలేక నీటిలో మునిగిపోయి మృతి చెందాడు. చుట్టుపక్కల పొలాల్లో పనిచేస్తున్న రైతులు కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. స్థానికులు విషయాన్ని పోలీసులకు తెలియజేయగా రైటర్ సలీం బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

నీ భర్తను చంపకుంటే.. నిన్ను చంపేస్తా

- సైనెడ్ ఉపయోగించాలని భార్యపై ఒత్తిడి
- ఎలా చేయాలో చూపేందుకు బిక్షగాడి హత్య
- పలు దఫాలుగా ఆమె భర్తపై హత్యాయత్నాలు
- ఇవీ ఓ వైసీపీ నాయకుడి ఉన్మాద చర్యలు



నాటి మంత్రి తానేటి వనితతో నాగేశ్వరరావు(ఫైల్)

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాను బెదిరించి లొంగదీసుకున్న మహిళతో ఆమె భర్తను హత్య చేయించేందుకు ఓ వైసీపీ నేత అమాయకుడైన ఓ బిక్షగాడిని హత్య చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన ఆ పార్టీ నేత దేవరకొండ నాగేశ్వరరావు అలియాస్ ఓంకార్ సాగించిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇతని అరాచకాలపై బాధిత కుటుంబం ఈ నెల 2న గుంటూరు జిల్లా ఎస్పీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితుల ఫిర్యాదుతో నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు, మహిళా పోలీస్ స్టేషన్‌లో మరో కేసు నమోదు చేశారు. ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తర్వాత కేసులైతే నమోదు చేశారు గానీ ఇంతవరకు నిందితుడిని అదుపులోకి తీసుకోలేదు. ఇప్పటికీ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు బాధిత కుటుంబం నిర్వహించే దుకాణం వద్ద, ఇంటి సమీపంలో రెక్కీ నిర్వహిస్తుండటంతో ఆ కుటుంబం హడలిపోతోంది. బాధిత మహిళ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలకలూరిపేట రోడ్డులో మరమరాలబట్టీ దుకాణం నిర్వాహకురాలిని లొంగదీసుకునేందుకుగానూ నిందితుడు నాగేశ్వరరావు తన అనుచరులతో మూడు దఫాలు దొంగతనాలు చేయించాడు. బాధిత మహిళ నగరంపాలెం స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదు చేశారు. కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

హత్య చేయించడానికి ఎన్నో ప్రయత్నాలు..

ఓ మహిళను లొంగదీసుకుని వారు ఏకాంతంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలను అడ్డుపెట్టుకొని ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఆమె ద్వారానే ఆమె భర్తను హత్య చేయించేందుకు ఆ వైసీపీ నేత కుట్ర పన్నాడు. ఇందుకు గానూ ఓ బిక్షగాడిని కడతేర్చాడు. భర్తను చంపక పోతే ఆమెను, ఆమె పిల్లల్ని చంపేస్తానంటూ బెదిరించాడు. ఎవరికి అనుమానం రాకుండా, చేతికి మట్టి అంటకుండా ఎలా చంపాలి అనేది ఆమెకు తెలియజెప్పడానికి ఏకంగా ఓ బిక్షగాడిని సైనెడ్ ఇచ్చి చంపేసినట్లు బాధిత మహిళ ఆరోపిస్తుంది. చిలకలూరిపేట వెళ్లే జాతీయ రహదారిపై కాటూరి మెడికల్ కళాశాల సమీపంలోని సర్వీసు రోడ్డులో ఓ బిక్షగాడు గోనె పట్టాలతో డేరా కట్టుకొని నివాసం ఉండేవాడు. దారిన వచ్చి పోయేవారు ఇచ్చే వాటితో కడుపు నింపుకునేవాడు. అయితే వైసీపీ నేత నాగేశ్వరరావు ఓ బంగారు షాపులో పనిచేసే వ్యక్తి వద్ద నుంచి సైనెడ్ తెప్పించి బిక్షగాడికి నీటిలో కలిపి తాగించాడు. దీంతో అతను చనిపోయాడు. ఈ మొత్తం వ్యవహారాన్ని తన సెల్ ఫోన్‌లో వీడియో తీసి ఆమెకు చూపించాడు. ఇదేవిధంగా ఆమె భర్తను చంపాలని ఆమెను బెదిరించాడు. దీంతో భయపడిన మహిళ తన భర్తకు ఆహారంలో సైనెడ్ కలిపింది. అయితే ఆ ఆహారం నోట్లో పెట్టుకోగానే వికారంగా ఉండడంతో భర్త దాన్ని ఊసేశాడు. దీంతో ఏ మాత్రం అనుమానం రాకుండా ఆమె వెంటనే ఆహార పదార్థాలను బయట పడేసింది. ఈ ప్రయత్నం విఫలం కావడంతో ఆ తర్వాత విజయవాడలో కుక్కలు పట్టుకునే వారి వద్ద నుంచి తీసుకొచ్చిన ఇంజక్షన్ ఆమెకు ఇచ్చి భర్త నిద్రపోయే సమయంలో చేయాలంటూ బెదిరించాడు. కాని ఆమె ఇంజక్షన్ చేయలేకపోయింది. భర్తతో ద్విచక్ర వాహనంపై వచ్చే సమయంలో నీ చేతిలో ఉన్న సంచి కింద పడేసుకుంటే దానికోసం బండి ఆపుతాడని, ఆ సమయంలో తాము వచ్చి అతనికి ఇంజక్షన్ గుచ్చి వెళ్తామని చెప్పాడు. ఆ విధంగా చేయాలని నాగేశ్వరావు ఒత్తిడి తెచ్చినా బాధిత మహిళ అంగీకరించలేదు. దీంతో హత్య చేయడానికి నాగేశ్వరావు తన అనుచరులతో స్వయంగా రంగంలోకి దిగాడు.

చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి

2011లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు వెంగళాయపాలెం వచ్చిన సందర్భంలో తన అనుచరులతో చంద్రబాబుపై కోడిగుడ్లతో దాడి చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులోనూ పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కబ్జాలు.. అరాచకాలు

దేవరకొండ నాగేశ్వరరావు వెంగళాయపాలెంలో వైసీపీ నాయకుడుగా చలామణి అవుతూ గ్రామంలో కబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో రోడ్డు పక్కన వాగు పోరంబోకులో అనుమతి లేకుండా ఇంటిని నిర్మించాడు. అందులో కొంతకాలం వైసీపీ కార్యాలయం నిర్వహించాడు. ఎన్ని నేరాలు చేసినప్పటికీ పోలీసులు కేసులు నమోదు చేయడంలేదు. అయన్ను పట్టుకునేందుకు ప్రయత్నం చేయడంలేదని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం పెద్దకాకాని పోలీసులు తెలిపారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల గ్రామానికి చెందిన దండ శ్రీనివాస్ రెడ్డి(24) బీటెక్ చదువుకొని ఖాళీగా ఉంటున్నాడు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో రింగ్‌రోడ్డులోని ఓ చెట్టుకు తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఓ లాడ్జిలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు నగరాలకు చెందిన వింత అక్కిరెడ్డి(54) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 8న ఇంటి నుంచి బయటకు వచ్చి ఇన్నర్ రింగ్‌రోడ్డులో లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రెండు రోజుల నుంచి బయటికి రాకపోవడంతో లాడ్జి నిర్వాహకులు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి రూమ్ తాళాలు తెరిచి చూడగా అక్కిరెడ్డి మృతి చెంది ఉన్నాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	94,102,113
చికెన్ విత్ స్కిన్	182.00
చికెన్ స్కిన్ లెస్	192.00

ఉత్తరాఖండ్‌పై రాజస్థాన్ భారీ స్కోరు

మంగళగిరి సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఉత్తరాఖండ్, రాజస్థాన్ మధ్య మూడు రోజుల మ్యాచ్ బుధవారం నుంచి ప్రారంభమైంది. తొలుత రాజస్థాన్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 82.1 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి రాజస్థాన్ 266 పరుగులు చేసింది. యథార్థ్ భరద్వాజ్ 8 ఫోర్లతో 50 పరుగులు, షిఫాన్ ఖాన్ 5 ఫోర్లతో 48 పరుగులు చేశారు. ఉత్తరాఖండ్ బౌలర్లు అభిమన్యు, ఎండీ షాద్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 8 పరుగులు చేసింది.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

పాఠశాలల్లో డీఈవో తనిఖీలు

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో నిబంధనల ప్రకారం సమ్మెటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించాలని, పరీక్షలు పూర్తి కాగానే ఆయా ప్రశ్నాపత్రాల జవాబులను విద్యార్థులతో చదివించాలని డీఈవో సీవీ రేణుక ఆదేశించారు. స్థానిక నగరంపాలెంలోని స్టాల్ స్కూల్, పట్టాభిపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. సమష్టి కృషితో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.



స్టాల్ స్కూల్‌లో పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఈవో సీవీ రేణుక

రేపు రైతులతో ప్రదర్శన

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా వైఎస్‌ఆర్‌సీపీ కార్యక్రమం పేరుతో ఈ నెల 13న జిల్లా కేంద్రం గుంటూరులో రైతులతో కలిసి కలెక్టరేట్ వరకు ప్రదర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు తెలిపారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు, రైతులతో కలిసి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. రైతు భరోసా పేరుతో వైసీపీ ప్రభుత్వం రూ.13,500 ఇస్తే పథకం పేరు మార్చి కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని ఈ ఏడాది ఒక్క రూపాయి కూడా అందించలేదని విమర్శించారు. దీనిపై రైతులతో కలిసి నిరసన ప్రదర్శన చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తాడికొండ సమన్వయకర్త డైమండ్‌బాబు, తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రాజనారాయణ ఉన్నారు.

15న మాలల సింహగర్జన

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరు శివారులోని నల్లపాడులో భారీ బహిరంగసభ 'మాలల సింహగర్జన' నిర్వహించనున్నట్లు మాజీ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గుంటూరులో బుధవారం మీడియా సమావేశంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

రేషన్ బియ్యం వాహనం పట్టివేత

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్ పేట పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ 4వ లైను వద్ద వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు సరఫరా చేసే రేషన్ బియ్యం గూడ్స్ ఆటోను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో అక్ర మంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద నుండి 60 బస్తాలలో ఉన్న మూడు వేల కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటో సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

వడ్డీ వ్యాపారుల మోసం

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రెడ్డిపాలెంకు చెందిన కొండా రామ చంద్రారెడ్డి, ఆయన తండ్రి రామకోటిరెడ్డి, ఆయన భార్య కొండా లక్ష్మీకాంతమ్మ, కొండా రమ్య పూజితలు అధిక వడ్డీల పేరుతో తన ఇళ్లను ఆక్రమిస్తున్నారని స్థానిక అన్నపూర్ణ నగర్‌కు చెందిన మక్కెన పద్మజ ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. నిందితులు తనకు చెందిన అన్నపూర్ణనగర్, గోరంట్ల 4వ లైను, అమరావతి రోడ్డు లోని ఐదు ఫ్లోర్‌ల బీబీఆర్‌అండ్ జోహా అర్కెడ్ కాంప్లెక్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్లను మొదట జీపీఏ చేయించుకొని తమకు డబ్బులు ఇచ్చారన్నారు. ఇచ్చిన డబ్బుకు అధిక వడ్డీ ల పేరుతో మూడు, ఆరు నెలలకు ఒకసారి, ఏడాదికి ఒకసారి లెక్కిస్తున్నారని తెలిపారు. అధికవడ్డీలతో తాము తిరిగి చెల్లించలేని స్థితికి తీసుకువచ్చి, తమను మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు. తమపై దౌర్జన్యం చేసి కాంప్లెక్స్‌ను ఆక్రమించారని, అక్కడ టేబుల్స్ వేసుకొని వాళ్ళ కుర్రోళ్లను కాపలా పెట్టించి తమకు వచ్చే బేరాలను చెడగొడుతున్నారని పేర్కొన్నారు. ఆయా ఫ్లోర్లను వారినే ఉంచుకుని మిగిలిన డబ్బులు ఇవ్వమని అడిగితే అందుకు అంగీకరించడం లేదని చెప్పారు. మీ ఆస్తి మాకు వద్దు, మీరు అమ్మినప్పుడు మాకు డబ్బులు ఇవ్వండని, కాలయాపన చేస్తున్నారన్నారు. తమ ప్రాపర్టీమీద తక్కువ వడ్డీలకు లోన్లు తెచ్చు కుంటూ, అద్దెలు వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తాము తీసుకున్న అప్పు అధిక వడ్డీలతో కలిపి ఈ కాంప్లెక్స్ విలువ కన్నా ఎక్కువైందని తెలిపారు. అప్పుగా తీసుకున్న మొత్తం డబ్బులు కట్టాలని లేని పక్షంలో ఇతర ఆస్తులు ష్యూరిటీగా ఇవ్వమంటూ భయపెడుతున్నారని ఆరోపించారు.

వైసీపీ అరాచకాలతోనే సమస్యలు: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గత పాలనలో వైసీపీ నాయకుల అరాచకాల వల్లే ప్రజలకు సమస్యలు వచ్చి పడ్డాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆరోపించారు. మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా వేదిక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలను చెప్పనేందుకు తరలివస్తున్నారని అన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలు, భూ దోపిడీలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని, 'స్పందన' పేరుతో ప్రజలను మభ్య పెట్టారని, అనేక సమస్యలు పెండింగ్‌లోనే ఉంచారని విమర్శించారు. వైసీపీ పాలనలో సమస్యలు పరిష్కారం కాకపోగా, వారి నాయకులే ఎక్కువ సమస్యలు సృష్టించారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో వైసీపీ బాధితులంతా టీడీపీ కార్యాలయానికి క్యూ కడుతున్నారని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని అర్జీదారులతో ఎమ్మెల్యే చెప్పారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల నియంత్రణకు చర్యల కోసం నియోజకవర్గాల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఏటుకూరు రోడ్డులో ఉన్న స్నేహ వెల్ఫేర్ వెల్ఫేర్ సొసైటీ వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సినేషన్ చేస్తోందని తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు ప్రత్యేకగా వాహనాలు, సూపర్ వైజర్, డాగ్ క్యాచర్లకు విధులు కేటాయించామని తెలిపారు. వీధి కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ప్రతిరోజూ ప్రజారోగ్య అధికారులు అందించే షెడ్యూల్, పీజీఆర్ఎస్, 103 సెల్ ఫిర్యాదుల మేరకు ఉదయం 6 నుండి 8, 10 నుండి ఒంటి గంట వరకు విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆయా వార్డులకు ఈ బృందాలు వచ్చినప్పుడు స్థానిక శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లు తమ ప్రాంతంలో పట్టుకున్న కుక్కలు, తిరిగి వదిలిపెట్టిన వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.



కమిషనర్ పులి శ్రీనివాసులు



ఓవర్ స్పీడ్‌తో వెళ్తూ పట్టుబడిన యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

ఓవర్ స్పీడ్‌పై స్పెషల్ డ్రైవ్.. వాహనాల సీజ్

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అజాగ్రత్తగా, అతివేగంగా బైకులు నడుపుతున్న 20 మందిని బుధవారం అదుపులోకి తీసుకుని వారి బైకులు సీజ్ చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య మాట్లాడుతూ అరండల్‌పేట - బ్రాడీపేట ప్రధాన రహదారి వెంబడి సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై తక్షణమే చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. మితిమీరిన వేగంతో, అడ్డదిడ్డంగా, మద్యం తాగివాహనాలు నడిపితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు., ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా వాహనాలను జాగ్రత్తగా నడపాలని సూచించారు. 'వేగం కన్నా ప్రాణం మిన్న' అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, మీ భద్రతతో పాటు ఎదుటివారు భద్రత కూడా ముఖ్యమని, ఈ విషయం తెలుసుకుని వాహనాలు నడపాలని సూచించారు. ద్విచక్ర వాహదారులు హెల్మెట్, నాలుగు అంత కంటే ఎక్కువ చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ప్రయాణ సమయంలో ధరించాలని సూచించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ పాతూరి రాధిక తదితరులు

ప్రాంగణ ఎంపికల్లో 'విజ్ఞాన్' విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ప్రఖ్యాత అమె జాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో వార్షివేతనం రూ. 11లక్షలతో ఈ ఉద్యోగాలకు వారు ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా, ఐబీఎం సంస్థలో రూ. 11 లక్షల వార్షిక వేతనానికి ఒకరు, విన్ ఫైర్ సంస్థలో రూ. 6 లక్షల వార్షిక వేతనానికి ముగ్గురు, టీసీఎస్ డిజిటల్‌లో రూ.7 లక్షల వార్షిక వేతనానికి నలుగురు, టీసీ ఎస్ నింజాలో రూ.3.5 లక్షల వార్షిక వేతనానికి 30 మంది విద్యార్థినిలు ఎంపికైనట్లు తెలిపారు.

కేహెచ్‌ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) స్థానిక చౌడవరంలోని కళ్ళం హరనాధరెడ్డి ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జెట్టి వీరకుమార్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమా శంకరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఏ స్టడీ ఆన్ ది ఇంపాక్ట్ ఆఫ్ మొబైల్ హ్యాండ్సెట్ అట్రిబ్యూట్స్ ఆన్ కస్టమర్ సాటిస్ ఫ్యాక్షన్ టు డ్రైవ్ బ్రాండ్ లాయల్టీ' అనే అంశంపై ఆయన పరిశోధన చేసినందుకుగాను ఆయనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సంచాలకులు డాక్టర్ కేలలిత గైడ్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా వీరకుమార్‌ను అధ్యాపకులు అభినందించారు.



వీరకుమార్‌ను అభినందిస్తున్న ఉమాశంకరరెడ్డి తదితరులు

కర్బన ఉత్ప్రేరిత చర్యలతో విప్లవాత్మక ఫలితాలు

గుంటూరు(విద్య), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొత్త విధానాలు, ప్రయోగాలు, కర్బన ఉత్ప్రేరిత చర్యల ద్వారా విప్లవాత్మక ఫలితాలను సాధించ వచ్చని ఐఐటీ కాన్పూర్ చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆచార్య వీకే సింగ్ అన్నారు. చేబ్రోలు మండ లం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, న్యూఢిల్లీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఐఎఫ్‌సీపీఏఆర్ (ఇండో- ఫ్రెంచ్ సెంటర్ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ అడ్వాన్స్డ్ రీసెర్చ్), సీఈఎఫ్ఐపీఆర్ఏ (సెంటర్ ఫ్రాంకో-ఇండీన్ పౌర్ లా ప్రమోషన్ డీ లా రీసెర్చ్ అవంకీ)ల ఆర్థిక సౌజన్యంతో జాయింట్ ఇండో- ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ సెమినార్ ఆన్ 'ఎక్స్‌ప్లోరింగ్ కాంటెంపొరరి విస్టాస్ ఇన్ అఫ్లైయింగ్ (ఆర్గానో) కాటలిసిస్ ఫర్ ఫార్మా ఇండస్ట్రీ: ఫర్ సస్టైయినింగ్ ఫ్యూచర్' అనే అంశంపై మూడు రోజుల జరిగే ఇంటర్నేషనల్ సెమినార్ బుధవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీకే సింగ్ మాట్లాడుతూ క్రియేటివిటీ ద్వారా పర్యావరణ అనుకూల కాటలిస్ట్‌లను అభివృద్ధి చేయడం సులభమని, ఇది గ్రీన్ కెమిస్ట్రీ దిశగా ముందడుగు వేసి నట్లవు తుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన కాటలిటిక్ ప్రక్రియలను రూపొందించినట్లయితే పరిశ్రమలకు లాభదాయకమని సూచించారు. అనంతరం మరో ముఖ్యఅతిథి సీఈఎఫ్ఐపీఆర్ఏ డైరెక్టర్ ప్రొఫెసర్ నితిన్ సేథ్ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ దేశాల ప్రతి నిధులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ఆచార్య డీబీ రామాచారి, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఆచార్య పీ వెంకటేష్, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి ఆచార్య మధుసూదన్, వైస్ చాన్స్‌లర్ కల్నల్ ఆచార్య పీ.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.



సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య వీకే సింగ్ తదితరులు

సీతారామయ్య హై స్కూల్ విద్యార్థులకు అవార్డులు

గుంటూరు కార్పొరేషన్,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ నిర్వహించిన లలిత కళా ఉత్సవ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాటిబండ్ల సీతారామయ్య (సీబీఎస్ఈ) హైస్కూల్ విద్యార్థులు అవార్డులు కైవసం చేసుకున్నారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ బుధవారం తెలిపారు. పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న జే పల్లవి కథా రచనలో సర్వోత్తమ స్థానాన్ని, 9వ తరగతి చదువుతున్న జీ భరణి ప్రతాప్ తాళ ప్రధానంలో సర్వోత్తమ స్థానాన్ని,9వ తరగతి చదువుతున్న కే వెంకటసాయి చరణ్ కీబోర్డ్‌లో విశిష్టోత్తమ స్థానాన్ని, 9వ తరగతి చదువు తున్న జైనీల్ తాళ ప్రధానం విశిష్టోత్తమ స్థానాన్ని, 9వ తరగతి చదువుతున్న టీ బోస్ అనుదీప్ కృష్ణ తాళ ప్రధానంలో ఉత్తమ స్థానాన్ని, ఏడవ తరగతి చదువుతున్న షిరీన్ లేఖ రచనలో ఉత్తమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాన్ని పెంపొందించామని అన్నారు.

కాపు కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు ప్రారంభించండి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాపు కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను ప్రారంభించాలని ప్రభుత్వానికి కాపు జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక గుజ్జనగుండ్లలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు చంద్రబాబునాయుడు స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ సమీపంలో కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ పనులు ప్రారంభం కాలేదని అన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది కనుక ఆ పనులు ప్రారంభించాలని కోరారు. అంతకుముందు స్థానిక గుజ్జనగుండ్లలోని వంగవీటి రంగా విగ్రహం నుంచి కమ్యూనిటీ స్థలం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.



వంగవీటి రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు జేఏసీ సభ్యులు

కేరళ ప్రభుత్వంపై కక్ష సాధింపులు ఆపండి

● లాడ్జి సెంటర్‌లో ప్రజా సంఘాల ధర్నా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళపై కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపులు విరమించుకోవాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక లాడ్జి సెంటరులో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానిక సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన పరిపాలనను కేరళ ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో కేరళ ప్రభుత్వ పాలనను దెబ్బతీసే విధంగా కేంద్రం కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపి వేసిందని, అభివృద్ధిని ఆటంకపరుస్తూ కేరళ రాష్ట్రాన్ని బలహీన పడే విధంగా కుట్ర పన్ను తోందని విమర్శించారు. కేంద్రానికి అను కూలంగా లేని రాష్ట్రాలపై రకరకాల రూపంలో ఫెడరల్ వ్యవస్థను నాశనం చేస్తోందని మండిపడ్డారు. ఇటు వంటి వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. నిరసనలో నాయ కులు అజయ్, అప్పారావు, శ్రీనివాసరావు, రంగారెడ్డి, కోటేశ్వరరావు, అంజిబాబు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ప్రజా, కార్మిక, రైతు సంఘ నాయకులు

'ఉద్యమబాట'కు స్పందన కరువు: మన్నవ

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపు నిచ్చిన 'ఉద్యమ బాట' కార్యక్రమం తుస్సు మందని, సొంత పార్టీ నేతల నుంచి కూడా ఈ కార్యక్రమానికి స్పందన కరువైందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఎద్దేవా చేశారు. గుజ్జనగుండ్లలోని తన కార్యా లయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల్లో ఎన్నడూ చూడని వ్యతిరేకత కనపడుతోందని, 'సూపర్ సిక్స్' వాగ్దానాలు గాలికిపోయాయని ఆరోపిస్తూ జగన్ ఇచ్చిన ఉద్యమ బాట పిలుపునకు స్పందన లేదన్నారు. జగన్‌కు ఉద్యమ బాట పట్టే అర్హత ఉందా? అని సామాన్యుడితో పాటు సొంత పార్టీ నేతలే ప్రశ్నిస్తున్నారని అన్నారు. అలాంటి వ్యక్తి కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ ఉద్యమాలు చేస్తామంటూ బయలుదేరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న జగన్ ,తాను ఇచ్చిన హామీల్లో ఏ హామీ అమలు చేశారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యపాన నిషేధం, సీపీఎస్ రద్దు, పోలవరం పూర్తి చేశారా? రోడ్లు వేశారా? కనీసం గుంతలైనా పూడ్చారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన జగన్, తాను పైసా పెంచలేదని, చంద్రబాబు సీఎం అయ్యాక మళ్లీ బాదుడే బాదుడు మొదలుపెట్టారని అబద్ధాలు ఆడటం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.



మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

వైసీపీ పాలనలో స్వేచ్ఛ కోల్పోయిన ప్రజలు: దేగల

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పోగొట్టుకున్నారని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ఆరోపించారు. గుంటూరు లోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి పాలనలో గడచిన ఆరు నెలల నుంచి మాత్రమే రాష్ట్రంలోని ప్రజలు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అనుభవిస్తున్నారని అన్నారు. ఈ ఆరు నెలల్లో ప్రజలు తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వానికి చెప్పుకుంటున్నారని, సంక్షేమం విషయంలో గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వానికి నక్కకీ నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా ఎక్కడా ప్రజా సంక్షేమానికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, జగన్‌రెడ్డి తాను చేసిన అక్రమాలు, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు.



మాట్లాడుతున్న దేగల ప్రభాకర్



విలేకరులతో మాట్లాడుతున్న రాజా మాస్టారు, సుఖవాసి

రైతు పక్షపాతి ధూళిపాళ్ల నరేంద్ర : దాసరి రాజామాస్టారు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైరన్ ధూళిపాళ్ల నరేంద్ర రైతు పక్షపాతి అని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడు దాసరి రాజామాస్టారు ప్రశంసించారు. ముప్పై వసంతాల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న నరేంద్రకు అభినందన సభ నేపథ్యంలో జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు స్థానిక రింగురోడ్డులోని శుభం ఫంక్షన్ హాల్ ఎదుట ధూళిపాళ్ల వీరయ్య చౌదరి సభా ప్రాంగణంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించ నున్నట్లు చెప్పారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పాడిరైతుల కుటుంబాలకు ఫలాలు అందించిన ఘనత నరేంద్రది అని అన్నారు. నరేంద్ర తన రాజకీయ ప్రస్థానంలో మచ్చలేని నేతగా నిలిచారని కొనియాడారు. గత వైసీపీ పాలనలో ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించిన నరేంద్రను అక్రమంగా అరెస్టు చేసి జైలుపాలు చేసినా ఆయన వెనుకడుగు వేయలేదని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు జిల్లా రాజకీయాల్లో ఒక విలక్షణమైన వ్యక్తి నరేంద్ర అని అన్నారు. ప్రజా క్షేమం కోసం, కార్యకర్తల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్న వ్యక్తి ధూళిపాళ్ల నరేంద్ర అని కొనియాడారు.

మానవ జీవనానికి దిక్సూచి భగవద్గీత

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మానవ జీవితానికి దిక్సూచిలా భగవద్గీతలోని శ్లోకాలు ఉపయోగపడతాయని, ఇందులోని కర్మ ,భక్తిని యువత అనుభవంలోకి తెచ్చుకోవాలని డీఇవో సీవీ రేణుక అన్నారు. స్థానిక టీజేపీఎస్ కళాశాల సంస్కృత విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గీతాజయంతి వేడుకల్లో ఆమె మాట్లాడారు. వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత మార్గదర్శి అని బీహెచ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బీవి విజయభాస్కర్ అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన గీతాజయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న డీఈవో రేణుక

శ్రీమద్భాగవతం ప్రవచనం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మల్లాది కైలాసనాథ్ శ్రీమద్భాగవతం ధారావాహిక ప్రవచనాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ప్రవచనం చేస్తున్న మల్లాది కైలాసనాథ్



స్కామర్ల చేతికి చిక్కి విలవిల?

- ఫోన్ హ్యాకింగ్‌తో నగదు మాయం
- బంధాల బలహీనతలతో బెదిరింపులు
- పంజా విసురుతున్న సైబర్ నేరగాళ్లు



సైబర్ నేరగాళ్లు, స్కామర్ల బారినపడి ఆర్థికంగా నష్టపోవడం, మానసికంగా కుంగిపోవడం జరుగుతున్నాయి. ఆన్‌లైన్‌లో మోసపూరిత ప్రకటనలకు ఆకర్షితులై డబ్బు పోగొట్టుకున్న వాళ్లు, మోసపూరిత ఫోన్ కాల్స్ గురించి అవగాహన లేక తమ బ్యాంకు ఖాతాలు ఖాళీ చేయించుకున్న వాళ్ల సంఘటనలు తరచుగా వింటూనే ఉంటాం. సైబర్ నేరగాళ్ల బారి నపడే బాధితుల సంఖ్య రోజురోజు కూ పెరుగుతూనే ఉంది. ఈ తరహా మోసాలకు గురైన వారిలో ఉపాధ్యాయులు, వ్యాపారులు, సామాన్యులు.. ఇలా వివిధ రంగాలకు చెందిన వారు ఉన్నారు.

పొన్నూరుటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆన్‌లైన్ మోసాలు, మరోవైపు ఫోన్ హ్యాకింగ్‌లు. వీటి బారినపడి ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తింటున్న వారి సంఘటనల గురించి తరచుగా వింటూనే ఉన్నాం. సైబర్ నేరగాళ్లు, స్కామర్ల ఆఫర్లకు ఆకర్షితులై ఆర్థికంగా నష్టపోతున్నారు. మీ కుమారుడో, కుమార్తె కేసుల్లో చిక్కుకున్నారని వారు అరెస్టు కాకుండా తప్పించుకోవాలంటే డబ్బు చెల్లించాలంటూ ఏ మాత్రం అనుమానం రాకుండా మాట్లాడుతూ, కుటుంబ సంబంధాల బలహీనతలను అడ్డుపెట్టుకొని ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించుకుంటూ నేరాలకు పాల్పడుతున్నారు. ఆ ఫోన్‌కాల్స్ మోసపూరితమని తెలిసినా బాధితులు తలలు పట్టుకుంటున్నారు. ఈ తరహా ఘటనల్లో మోసపోయిన వ్యక్తుల్లో ఎక్కువ శాతం మంది ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావట్లేదు. నామోషీగా భావించో, పోలీస్ కేసు పెట్టినా తిరిగి తమ నగదు తమకు రాదేమోననే ఆలోచనతోనో వారు మిన్నకుండిపోతున్నారు.

సైబర్ క్రైమ్‌లు....

దేశంలో సాంకేతిక విప్లవం రావటంతో కంప్యూటర్ కే పరిమితమైన సాంకేతిక అరచేతిలో ఇమిడిపోయే సెల్‌ఫోన్‌లకు చేరింది. సాంకేతికతను వినియోగించుకోవడంతో మంచి జరుగుతుందనే భావించే ప్రజలు, సైబర్ నేరగాళ్ల, స్కామర్ల చేతికి చిక్కి విలవిలలాడే పరిస్థితులు. ప్రభుత్వాలు, పోలీసులు సైబర్ నేరాలపై ఎంత ప్రచారం చేసినా నేటికి సైబర్ నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టడం లేదు. నేరగాళ్ల ఆఫర్ల ఉచ్చుకు చిక్కి సామాన్యులు ఆర్థికంగా నష్టపోతున్నారు.

పంజా విసురుతున్న నేరగాళ్లు....

ప్రారంభంలో కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొప్పించి కంప్యూటర్‌లోని భద్రపరిచిన ఫైల్స్‌ను నిర్వీర్యం చేసిన సైబర్ నేరగాళ్లు క్రమంగా తమ ప్రాబల్యం పెంచుకుంటున్నారు. సెల్‌ఫోన్‌లోని వ్యక్తిగత విలువైన డేటాను హ్యాకింగ్ ద్వారా చోరీ చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నారు. నెట్ బ్యాంకింగ్ ద్వారా నగదు లావాదేవీలు వినియోగించేలా యాప్‌లు అందుబాటులోకి రావడంతో స్కామర్లు మరింతగా విజృంభిస్తున్నారు. నగదు బదిలీల సమయంలో అమాయికులను లక్ష్యంగా చేసుకుని వన్‌టైం పాస్‌వర్డ్‌లు దొంగిలించి నగదును ఖాతాదారులకు తెలియకుండా తమ ఖాతాల్లోకి మళ్లించుకుంటున్నారు. సాంకేతికత మరింత అందుబాటులోకి రావడంతో సైబర్ నేరగాళ్లు మరో ముందడుగు వేసి, దేశం వెలుపల ఉండే సైబర్ నేరగాళ్ల వ్యక్తిగత వివరాలను అడ్డు పెట్టుకొని మోసాలు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కట్టడికి సరైన వ్యవస్థ లేకపోవడంతో వీరి నేరాలు కొనసాగుతున్నాయి. డార్క్ వైబ్ సైట్‌లో అందుబాటులో ఉండే సాంకేతికతను అడ్డంపెట్టుకుని యథేచ్ఛగా ఆన్‌లైన్ నేరాల దందా సాగిస్తున్నారు.

స్కామర్ల నేరాలు..

పొన్నూరు పట్టణానికి చెందిన భార్యాభర్తలు ఇద్దరూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భర్త నెలూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నట్లుగా ఆయనకు ఇటీవల సెల్‌ఫోన్ నుంచి కాల్ వచ్చింది. వీరి కుమారుడి వివరాలు వెల్లడించి 'మీ అబ్బాయి యాక్సిడెంట్ చేశాడు.. ఒక యువతి చావు బతుకు

Types of Cyber Attacks



ల మధ్య ఉంది. వెంటనే వైద్యం చేయించాలి. వెంటనే నగదు బదిలీ చేయాలి' అని చెప్పారు. తమ కుమారుడతో మాట్లాడించాలని సదరు వ్యక్తి కోరగా ఓ యువకుడు ఏడుపు స్వరం వినిపించారు. దీంతో, బెదిరిపోయిన సదరు వ్యక్తి ఫోన్‌లోనే రూ. 75 వేల నగదు బదిలీ చేశాడు. కేసు నుంచి తప్పించాలంటే మరో లక్ష చెల్లించాలని డిమాండ్ చేయడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఈ విషయమై విచారణ చేస్తే ఎటువంటి ప్రమాదం జరగలేదని, వారి కుమారుడు క్షేమంగా ఉన్నట్లు సమాచారం తెలుసుకున్న ఆ తండ్రి మోసపోయినట్లు గుర్తించి లబోదిబోమంటున్నాడు.

బ్యాంక్ ఖాతా ఖాళీ..

పొన్నూరు మండలానికి చెందిన ఓ చిరు ఉద్యోగి వినియోగించే సెల్ ఫోన్‌కు ఒక ఆఫర్ మెసేజ్ వచ్చింది. దానికి ఆకర్షితుడైన ఆ ఉద్యోగి ఆ మెసేజ్‌ను డౌన్‌లోడు చేసుకున్నాడు. అంతే, అప్పటి నుంచి ఆ సెల్‌ఫోన్ హ్యాకింగ్‌కు గురైంది. సెల్ ఫోన్‌లో డేటా బదిలీ చేసుకోవడమే కాకుండా ఆ ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ. 79 వేలు ఉత్తరాది రాష్ట్రానికి చెందిన వ్యక్తుల ఖాతాలోకి బదిలీ చేసేసుకున్నారు. బ్యాంక్ ఖాతా ఖాళీ కావడంతో దిక్కుతోచని ఆ ఉద్యోగి పోలీసులను ఆశ్రయించాడు.

ఇంతవరకూ నెట్ ఆన్ చేయలేదు

ఓ వ్యక్తికి సోషల్ మీడియాలోని ఓ ఖాతా నుంచి ఇటీవల ఫోన్‌కాల్ వచ్చింది. ఆ ఫోన్ కాల్‌కు సమాధానం చెప్పడంతో, ఒక మహిళ దిగంబరంగా కనిపించి ఆ వ్యక్తిని కూడా వివస్త్రుడిగా మారమని కోరింది. దీంతో భయపడిన సదరు వ్యక్తి ఫోన్ కట్ చేసి నేటి వరకు నెట్ ఆన్ చేయలేదు. మరో ఘటనలో.. ఓ ప్రముఖ పత్రికా విలేకరికి ఇటీవల వాట్సప్ కాల్ వచ్చింది. కాలర్ ఐడీగా సీబీఐ అధికారిక చిహ్నం ఉండటంతోపాటు పోలీస్ ఆఫీసర్ యూనిఫారం ధరించిన వ్యక్తి ఫొటో ఉంది. దీంతో ఆ వ్యక్తి అవతలి వ్యక్తితో మాట్లాడాడు. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి సదరు వ్యక్తి కుమార్తె వివరాలు వెల్లడించడంతో పాటు ఆమెపై కేసు నమోదైందని, వదిలిపెట్టాలంటే ఫోన్ ద్వారా నగదు చెల్లించాలని డిమాండ్ చేశాడు. దీంతో, ఆ వ్యక్తికి అనుమానం వచ్చి డిస్కనక్ట్ చేశాడు.

ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తాం

చేబ్రోలు మండలానికి చెందిన వ్యాపారవేత్తకు పెట్టుబడులు పెడితే ఆకర్షణీయమైన రిటర్న్స్ ఇస్తామని ఫోన్‌లో సందేశం వచ్చింది. ఇది నమ్మిన ఆ వ్యాపారవేత్త రూ. 35 లక్షలు వరకు ఫోన్‌లో బదిలీ చేశాడు. ఎంతకు రిటర్న్స్ రాకపోవడం, నగదు బదిలీ చేయించుకున్న వారు తమ ఫోన్లు ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి మోసపోయానని సదరు వ్యాపారవేత్త గ్రహించాడు. పోలీసులను ఆశ్రయించారు. అలాగే మరో మహిళలకు సైతం రూ. 40 లక్షల మేర స్కామర్లు మోసం చేసినట్లు సమాచారం.

సైబర్ నేరగాళ్లు స్కామర్లు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నప్పటికి వారికి అడ్డుకట్టు వేయలేక పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేరాలకు పాల్పడుతున్న వారు స్థానికులు కాకపోవటం, ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారు కావడం, దేశం వెలుపల నివసిస్తూ ఉండటంతో ఈ తరహా కేసులు పరిష్కారం జటిలంగా మారుతున్నాయని పోలీసులు చెబుతున్నారు.



మిర్చియార్డు చైర్మన్.. మళ్లీ ఓసీకే

- ప్రతిపాదన సిద్ధం చేసిన మార్కెటింగ్ శాఖ
- కలెక్టర్ ఆమోదంతో త్వరలో గెజిట్ నోటిఫికేషన్

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు(మిర్చియార్డు) పాలకవర్గం చైర్మన్ పీఠాన్ని మళ్లీ ఓసీకే రిజర్వు చేయాలని మార్కెటింగ్ శాఖ ప్రతిపాదించింది. ఏఎంసీల రిజర్వేషన్లను ఖరారు చేయాలని మార్కెటింగ్ కమిషనర్ నుంచి మెమో రావడంతో ఆ శాఖ జిల్లా అధికారులు వివిధ కమిటీలకు రిజర్వేషన్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కలెక్టర్ ఆమోదంతో వాటిని గజిట్‌లో ప్రచురించాల్సి ఉన్నది. అయితే ప్రస్తుతం కలెక్టర్ నాగలక్ష్మి కలెక్టర్ల సదస్సు, రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమై ఉండటంతో ఈ వారంతం/వచ్చే వారం దీనిపై దృష్టి పెడతారని అధికారవర్గాలు తెలిపాయి. ఎప్పటిలానే మిర్చియార్డుని ఓసీ(జనరల్)కు రిజర్వు చేయాలని ప్రతిపాదించారు. దీంతో టీడీపీ కూటమిలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకులు తమ వంతు ప్రయత్నాల్లో మునిగిపోయారు.

మిర్చియార్డుకు ప్రపంచ వ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతలు ఉండటంతో సహజంగానే ఈ పదవికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. అలానే యార్డులో ఏటా రూ. 10 వేల కోట్లకు పైగా మిర్చి లావాదేవీలు జరుగుతుంటాయి. ఇది కూడా చైర్మన్ పదవికి పోటీ పెరగడానికి మరో కారణం. అధికార పార్టీలో ఎవరికైతే ఎమ్మెల్యే స్థాయి టిక్కెట్‌ని ఎన్నికల్లో ఇవ్వలేకపోయారో అలాంటి వారికి ఈ పదవిని ఇచ్చి సంతృప్తిపరుస్తుంటారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో లేళ్ల అప్పిరెడ్డి, టీడీపీ హయాంలో మన్నవ సుబ్బారావు, వెన్నా సాంబశివారెడ్డి, వైసీపీ పాలనలో చంద్రగిరి ఏసురత్నం, నిమ్మకాయల రాజనారాయణలకు మిర్చియార్డు చైర్మన్ పదవులను ఆయా పార్టీలు ఇచ్చాయి. వీరంతా ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్‌ని ఆశించిన వారే. కాగా ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నది. ఈ నేపథ్యంలో చైర్మన్ పదవిని టీడీపీ/జనసేన పార్టీల్లో ఎవరో ఒకరికి లభించే అవకాశం ఉన్నది. ఒకవేళ టీడీపీకి చైర్మన్ పదవి లభిస్తే వైస్‌చైర్మన్ పదవిని జనసేనకు ఇస్తారు. అదే జనసేనకు చైర్మన్ పదవి వస్తే మిగతా పాలకపక్షంలో టీడీపీకి ఎక్కువ పదవులు లభిస్తాయి. బీజేపీ నుంచి కూడా ఒకరిద్దరికి కమిటీలో చోటు కల్పించాల్సిన పరిస్థితి ఉన్నది. అయితే రిజర్వేషన్ ప్రక్రియ ఖరారు అయిన తర్వాతనే మూడు పార్టీల నాయకులు కూర్చుని ఒక నిర్ణయం తీసుకొంటారు.

50 శాతం పదవులు మహిళలకే

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో 50శాతం పదవులు మహిళలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. దాంతో ఆ మేరకు మార్కెటింగ్ శాఖ అధికారులు కసరత్తు జరుపుతున్నారు. అలానే ఎస్‌సీలకు 15 శాతం, బీసీలకు 29 శాతం, ఎస్‌టీలకు 6 శాతం రిజర్వేషన్ ఉండేలా చూస్తున్నారు. కలెక్టర్ ఆమోదంతో గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలు గుంటూరు, తాడికొండ, మంగళగిరి, దుగ్గిరాల, ప్రత్తిపాడు, తెనాలి, పొన్నూరు, ఫిరంగిపురంలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ని ప్రకటించనున్నారు.



మంగళగిరి నుంచి ఎయిమ్స్‌కు వెళ్లే రహదారిలో మొక్కలను నాటుతున్న సిబ్బంది

ఎయిమ్స్ రహదారికి సొబగులు

- 17న రానున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

మంగళగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న సందర్భంగా ఎయిమ్స్‌కు వెళ్లే రెండు ప్రధాన రోడ్డు మార్గాలను అధికారులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మంగళగిరి నగరం వైపు నుంచి ఎయిమ్స్‌లోనికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించారు. ఎయిమ్స్ గేటు వద్ద ఉన్న మట్టిరోడ్డు మార్గాన్ని యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డుగా మార్చివేశారు. ఈ మార్గంలో వెలగని విద్యుద్దీపాల స్థానే కొత్త బల్బులను అమర్చారు. ఇక 16వ నెంబరు జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌లోకి వచ్చే ప్రధాన రహదారికి కొత్త సొబగులను అద్దేపనిలో పడ్డారు. వడ్డేశ్వరం వద్ద హైవే దిగువన ఉన్న అండర్‌పాస్‌తోపాటు దానికి ఇరువైపులా ఉన్న సర్వీసురోడ్లకు కొత్తగా బీటీ లేయర్ వేశారు. ఇప్పటివరకు పట్టించుకోని ఆ మార్గంలోని సెంట్రల్ డివైడర్‌కు గ్రీనరీ హంగులను సమకూరుస్తున్నారు. రోడ్డుకు అటుఇటుగా ఉన్న పిచ్చి మొక్కలను గడ్డిని తొలగించివేస్తున్నారు. అంతేకాదు.. కనకదుర్గా వారధి మీద ఉన్న గుంతలను సైతం పూడ్చివేస్తున్నారు. మొత్తం మీద రాష్ట్రపతి రాకతో ఎయిమ్స్ కు వెళ్లే మార్గాలు సుందరంగా, సౌకర్యవంతంగా మారుతున్నాయి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లకు పెరగనున్న జనరల్ బోగీలు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే జంక్షన్ మీదగా రాకపోకలు సాగించే మూడు రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యని దశలవారీగా పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మొదటిదశలో నంబరు. 12706/12705 సికింద్రాబాద్ - గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు జనరల్ బోగీల సంఖ్యని పెంచనున్నారు. దాదాపుగా 4 జనరల్ బోగీలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. రెండోదశలో నంబరు. 12704/12703 సికింద్రాబాద్ - హౌరా - సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, నంబరు. 12755/12756 కాకినాడ పోర్టు - భావనగర్ - కాకినాడ పోర్టు వీక్లీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 17211/17212 మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్, నంబరు. 12733/12734 తిరుపతి - లింగంపల్లి - తిరుపతి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లలో జనరల్ బోగీల సంఖ్య పెంచుతారు. వీటిల్లో మూడు చొప్పున జనరల్ బోగీలు పెరిగే అవకాశం ఉన్నది. దీనివలన సాధారణ ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రీడలతో శారీరక దృఢత్వం.. మానసిక ఉల్లాసం

- పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవంలో ఎస్పీ సతీష్ కుమార్



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ | కబడ్డీ పోటీల్లో పోలీస్ క్రీడాకారులు

గుంటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆటలు, క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ మీట్ పోటీలు-2024ను ప్రారంభించారు. జిల్లా పోలీస్ అధికారులతో కలసి ఆటలు, క్రీడల జెండాను ఎగురవేసి, క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం బందోబస్తు, శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీలు, వీవీఐపీల పర్యటన విధులు, నేరస్తుల అన్వేషణ, రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు అంటూ ఎన్నో విధుల్లో నిమగ్నమై, హడావుడిగా ఉండే పోలీసులకు వారి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధులకు స్వల్ప విరామాన్ని ఇచ్చి వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వారిలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారి సామర్థ్యాన్ని నిరూపించడానికి ఈ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడల్లోని క్రమశిక్షణ వ్యక్తులకు జవాబుదారీతనం, బాధ్యతను బోధిస్తుందన్నారు. టీమ్ స్పోర్ట్స్‌లో పాల్గొనడం నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుందన్నారు. ఒకరినొకరు ప్రోత్సహించుకోవడం, ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి సమిష్టిగా వ్యూహరచన చేయడం ఈ క్రీడల వలన అలవరుచుకుంటారన్నారు. గుంటూరు జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడలు, ఆటల పోటీలు ఈ నెల 13వ తేదీ వరకు జరగనున్నాయని, ఈ పోటీలలో 8 విభాగాల (6 పోలీస్ సబ్‌డివిజన్లు, ఒక ఏఆర్ విభాగం, ఒక - హెడ్ క్వార్టర్ విభాగం) నుండి సుమారు 150మంది క్రీడాకారులు ఆయా పోటీలకు హాజరయ్యారన్నారు. ఈ పోటీల్లో పరుగు పందాలు, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, హైజంప్, షార్ట్‌పుట్, షటిల్, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడలు, ఆటలకు సంబంధించి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రమణమూర్తి, సుప్రజ, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- ఏకగ్రీవానికి సయోధ్య
- చాంబర్ గౌరవాధ్యక్ష పదవికి ఆంజనేయులు
- అధ్యక్ష బరిలో తెరపైకి మాజీ కార్పొరేటర్ యేల్చూరి పేరు

గుంటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు సమీపించే కొద్ది వ్యవహారం రసవత్తరంగా మారుతోంది. ప్రతి ఏటా జరగాల్సిన ఎన్నికలు ఈ నెల 28న నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో పలువురు చాంబర్ సభ్యులు, టీడీపీకి చెందిన ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. చాంబర్ ఎన్నికలు ఏకగ్రీవం చేసేలా చర్చలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష పదవికి కాకుండా గౌరవాధ్యక్షుడుగా ఆతుకూరి ఆంజనేయులు కొనసాగేలా ఒప్పించినట్లు సమాచారం. అధ్యక్ష స్థానంలో మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు బరిలో నిలుస్తున్నట్లు తెలిసింది. కాగా ఇదే సమయంలో గత ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలైన రంగా బాలకృష్ణ కూడా ఈ దఫా అధ్యక్ష పదవి కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వ్యాపారవర్గాల నుంచి మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారు. అయితే , ఎన్నికలు ఏకగ్రీవమయ్యేలా కొందరు ఆర్యవైశ్య నాయకులు రంగంలోకి దిగారు. 34 ఏళ్ళగా ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తోన్న ఆతుకూరి ఆంజనేయులను ఈ దఫా చాంబర్ గౌరవాధ్యక్షుడుగా నిలిపి ఏకాభిప్రాయంతో మరొకరికి అధ్యక్ష పదవితో ఎన్నికలు ఏకగ్రీవం చేసేందుకు కొందరు ఆర్యవైశ్య నాయకులు సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు. బరిలో ఉన్న వారు వెనక్కి తగ్గుతారా లేదా అనేది వేచి చూడాలి.

13న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. తెనాలిలోని ఐటీఐ కళాశాల, నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది నుంచి పీజీ వరకు విద్యార్హత ఉన్న 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు ఉన్న యువతీయువకులు అర్హులని తెలిపారు. బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

రాజధాని రైతులకు ఈ-లాటరీ నేడు

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి రైతులకు ప్రత్యామ్నాయంగా అప్పగించే ప్లాట్లకు ఈనెల 12న గురువారం 'ఈ-లాటరీ' నిర్వహిస్తున్నట్లు ఏపీ సీఆర్డీఏ కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ప్రధాన కార్యాలయంలో 'ఈ-లాటరీ' జరుగుతుందని తెలిపారు. అమరావతి ప్రాంతంలోని 14 గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్టు తెలిపారు. నవులూరు 1, 2 కురగల్లు 1, 2 నిడమర్రు 1, 1 రాయపూడి 1, 2 లింగాయపాలెం, మల్కాపురం, నెక్కల్లు, శాఖమూరు, తుళ్లూరు 1, 2 వెలగపూడి, మందడం 1, 2 అనంతవరం, ఐనవోలు తదితర గ్రామాల్లో సంబంధిత రైతులు హాజరుకావాలని సూచించారు.



బుధవారం రాత్రి విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్ రోడ్డు. వెయ్యి కోట్ల రూపాయల వ్యయంతో 16.4 కి.మీ. పొడవున నిర్మించిన దేశంలోనే మొట్టమొదటి ఈ మోడల్ బైపాస్ రోడ్డుపై గతవారం రాకపోకలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ అవసరాల కోసం ఒక మెగావాట్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా నేషనల్ హైవే సంస్థ రోడ్డు పక్కన ఏర్పాటుచేసింది.

- (ఆంధ్రజ్యోతి) చిలకలూరిపేట

రైలు ప్రయాణం.. నరకం



(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్నం 3, 4 గంటలకు విజయవాడ చేరుతున్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ కూడా ఈ వారంలో రెండురోజులు గంటన్నర ఆలస్యంగా నడిచింది. సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా ప్రయాణికులకు నరకం చూపుతున్నాయి. నరసాపురం నుంచి వచ్చే రైళ్లు, కాకినాడ నుంచి ముంబై వెళ్లే లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ కూడా గుంటూరుకు గంటకుపైగా ఆలస్యంగా వస్తున్నాయి. విజయవాడ నుంచి జిల్లాలోని తెనాలి, నిడుబ్రోలు, బాపట్లను కలుపుతూ చీరాల, ఒంగోలు మీదగా వెళ్లే రైళ్లు చాలా ఆలస్యంగా వెళుతున్నాయి. వంద కి.మీ దూరం ఉన్న చీరాల- విజయవాడ ప్రయాణం సగటున 4 నుంచి 7 గంటల వరకూ సమయం పడుతోంది. ఈ రూటులో ఇప్పటికే అనేక పాసింజర్ రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. ఉన్న రైళ్లను కూడా ఆలస్యంగా నడుపుతోంది. ఈ రూటులో నడిచే పాసింజర్ రైళ్లు ప్రతిరోజూ సగటున గంట నుంచి రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. క్రిష్ణాఎక్స్‌ప్రెస్ కూడా గంటకు తక్కువ కాకుండా ఆలస్యంగా నడుస్తున్నది. విజయవాడ- గూడూరు పాసింజర్ పరిస్థితి అసలు చెప్పడానికే వీలు లేదు. ఈ రైలు విజయవాడకు చేరే వరకూ నమ్మకం లేని పరిస్థితి.

నాడు రైళ్లు రద్దు.. నేడు ఆలస్యం

2020లో కరోనా వంకతో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ పేరు చెప్పి రైల్వేశాఖ దేశవ్యాప్తంగా రైళ్లను అర్ధాంతరంగా రద్దుచేసింది. ఆ తర్వాత రెండు నెలలకు రైళ్లను పునరుద్ధరిస్తున్నామని చెప్పినా సాధారణ ప్రయాణికులు ప్రయాణించే పాసింజర్ రైళ్లను మాత్రం పునరుద్ధరించలేదు. కేవలం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మాత్రమే నడిపింది. ప్రయాణికుల నుంచి ఒత్తిడి పెరగడంతో స్పెషల్ రైళ్ల పేరుతో పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ చార్జీలతో తిరిగి తీసుకువచ్చింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టికెట్ ధరలు తగ్గించినా రైళ్లను మాత్రం స్పెషల్ రైళ్లుగానే నడుపుతోంది. రద్దయిన రైళ్లను మాత్రం తిరిగి పునరుద్ధరించలేదు. పైపెచ్చు అనేక గ్రామాల్లో స్టాపులను కూడా తొలగించేశారు. కాగా 2024 ఏడాది మొత్తం అభివృద్ధి పనుల పేరుతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తిరిగే స్పెషల్ రైళ్లను, సింహాద్రి, గోల్కొండ వంటి సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లను కూడా రైల్వే శాఖ నెలల తరబడి రద్దుచేసింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రత్యేకించి సీజన్ ప్రయాణికులైన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనులకోసం వెళ్లే కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నగిషీలకు ప్రాధాన్యం..

రెండు మూడేళ్లుగా రైల్వే శాఖ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణపై దృష్టి సారించింది. వందల కోట్లు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను అత్యాధునికంగా తీర్చిదిద్దుతోంది. అందమైన చిత్రమాలికలు, విగ్రహాలు, నగిషీలతో చక్కగా తీర్చిదిద్దుతోంది. కానీ రైళ్ల గురించి పట్టించుకోవడంలేదు. రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణపై దృష్టి సారించడంలేదు. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించేలా రైళ్లను ఏర్పాటు చేయడంలేదు. వందలకోట్లు ఖర్చు చేసి స్టేషన్లను అభివృద్ధి చేసే బదులు రైళ్లను పునరుద్ధరించి, ప్రయాణ నాణ్యతను పెంచవచ్చు కదా అంటూ ప్రయాణికులు వాపోతున్నారు.

పొమ్మనకుండానే పొగ..

రైల్వే శాఖకు సరుకు రవాణా రైళ్లే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. ప్రయాణికుల రైళ్ల కంటే గూడ్స్ రైళ్లపై వచ్చే ఆదాయం ఎక్కువ కావడంతో పాసింజర్ రైళ్లు తగ్గించాలని గతం నుంచి ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. అయితే రైల్వే అనేది సేవా దృక్పథంతో ఏర్పాటు చేసింది కాబట్టి గత ప్రభుత్వాలు అంత ధైర్యం చేయలేకపోయాయి. అయితే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో భిన్నంగా వ్యవహరిస్తోంది. రైళ్లను రద్దు చేయడం, ప్రయాణంలో అంతరాయాలు కల్పించడం ద్వారా ప్రయాణికులే దూరమయ్యేలా చేస్తోందని పలువురు విమర్శలు చేస్తున్నారు. రైల్వే శాఖ తీరు కూడా గత కొంతకాలంగా అలానే ఉంటోంది. ఇప్పటికైనా ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైళ్లను పునరుద్ధరించి, సకాలంలో నడిపి సగటు ప్రయాణికుల విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 725 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 223 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 78 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 53 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 143 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1245 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

1522 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 1522 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,400, గరిష్ఠ ధర రూ.11,550, మోడల్ ధర రూ.11,125 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,400, గరిష్ఠ ధర రూ.11,550, మోడల్ ధర రూ.10,450 పలికాయి.

అప్పాపురంలో క్రిస్మస్ స్టార్



ప్రత్యేక ఆకర్షణగా క్రిస్మస్ స్టార్

కాకుమాను, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాపురం ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ పరిశుద్ధ దేవాలయం వద్ద బుధవారం రాత్రి భారీ క్రిస్మస్ స్టార్‌ను ఏర్పాటు చేశారు. సుమారు 10 అడుగుల స్టార్‌లో ప్రత్యేక విద్యుద్దీపాలు ఆకర్షణగా నిలిచాయి.

పాస్టర్లకు నూతన వస్త్రాల పంపిణీ



పాస్టర్లకు నూతనవస్త్రాలు అందజేత

తాడేపల్లి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణం సీతానగరంలోని కల్వరి ప్రార్థనా మందిరంలో బుధవారం 116 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఎంటీఎంసీ పాస్టర్ల ఫెలోషిప్ కల్వరి కృపా ట్రస్ట్ కార్యదర్శి సీహెచ్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరై నూతనవస్త్రాలు పంపిణీ చేసి మాట్లాడుతూ క్రైస్తవులకు చట్ట సభలో అవకాశం కల్పించాలని కోరారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కార్పొరేషన్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు టి.రాజేష్, గౌరవాధ్యక్షుడు జగన్ మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆశీర్వాదం, కోశాధికారి శ్యాంబాబు, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండల 'వెలుగు' సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం వీరయ్య

తుళ్లూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల వెలుగు సమావేశం తుళ్లూరు కార్యాలయంలో ఏపీఎం చిన వీరయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. మూడు నెలలకొకసారి ఈ సమావేశం నిర్వహిస్తుంటారు. ఇంటర్నెల్ ఆడిట్ జరిగే ముందు సమావేశం జరుపుతామని ఏపీఎం తెలిపారు. పుస్తకాల నిర్వహణ, రుణాల అమలు, స్త్రీనిధి రుణాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి వెలుగు సిబ్బందికి ఏపీఎం తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

15న కుంచనపల్లిలో వైద్యశిబిరం

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మానవ సేవాసంస్థ ఆధ్వర్యంలో కుంచనపల్లిలోని డిమార్ట్ పక్కన రామ్‌స్నేహ అవెన్యూ అపార్టుమెంట్‌లో ప్రతి నెల రెండో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 15న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి, జనరల్, డయాబెటిక్, దంత వైద్యులు పాల్గొని పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తారన్నారు. అలాగే షుగరు, బీపీ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు వినియోగించుకోవాలని, వివరాలకు 9985222857లో సంప్రదించవచ్చని తెలిపారు.

కేరళ ప్రభుత్వంపై కక్ష సాధింపులు ఆపండి

● లాడ్జి సెంటర్లో ప్రజా సంఘాల ధర్నా

గుంటూరు(తూర్పు), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేరళపై కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపులు విరమించుకోవాలని కార్మిక, రైతు, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక లాడ్జి సెంటరులో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానిక సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శవంతమైన పరిపాలనను కేరళ ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో కేరళ ప్రభుత్వ పాలనను దెబ్బతీసే విధంగా కేంద్రం కక్ష సాధింపు ధోరణిలో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపి వేసిందని, అభివృద్ధిని ఆటంకపరుస్తూ కేరళ రాష్ట్రాన్ని బలహీన పడే విధంగా కుట్ర పన్నుతోందని విమర్శించారు.

పేదరికం లేని పచ్చదనం, పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం కావాలి

● ఎంపీడీవో రమేష్‌బాబు

● గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణపై శిక్షణ తరగతులు



వట్టిచెరుకూరులో శిక్షణా తరగతుల ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీడీవోలు

వట్టిచెరుకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దటం కోసం ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామ అధికారులు సమష్టి కృషితోనే సాధ్యమన్న విషయాన్ని గుర్తించాలని ఎంపీడీవో రమేష్‌బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ నిధులతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వట్టిచెరుకూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై శిక్షణా తరగతులు ఎంపీపీ చిలకా రాజ్యం బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీడీవో రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులను ఉద్దేశించి శిక్షణ తరగతుల లక్ష్యాన్ని వివరించారు. పచ్చదనం, పరిశుభ్రత కలిగి సుపరిపాలన, స్వయం సమృద్ధి, మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దుకుందామని ప్రతిజ్ఞ చేశారు. తొలుత ఆడిటోరియం వేదికపై మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలనతో తరగతులను ప్రారంభించారు.

● తాడికొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు స్థానికీకరణపై నాలుగు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సమతావాణి బుధవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16 నుంచి 19 తేదీ వరకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం వార్షిక ప్రణాళికలు సిద్ధం చేయటానికి శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లు, వీఆర్వోలు, డిజిటల్ సహాయకులు, వ్యవసాయ, హార్టికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు తదితర సిబ్బంది శిక్షణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎంపిక చేసిన మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇస్తారని తెలిపారు. మాస్టర్ ట్రైనీలుగా ఈవోపీఆర్‌డీ సాయిలీల, ఎంపీహెచ్‌వో రాఘవ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవిబాబు, ఫణిదం పంచాయతీ కార్యదర్శి లీలా ప్రసన్న, ఏపీఎం సాంబశివరావులను నియమించినట్లు పేర్కొన్నారు.

● పెదనందిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర స్థాయి పరిశీలకుడు, బాపట్ల విస్తీర్ణ కేంద్ర ప్రిన్సిపాల్ డి.వెంకట్రావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు బుధవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ వర్ధిని, సీహెచ్‌వో ప్రసాద్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మంచికలపూడి-పెనుమూలి రోడ్డుకు శంకుస్థాపన

● పీఎంజీఎస్‌వై కింద 4.2 కి.మీ నిర్మాణం



తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్ సమీపంలో మంచికలపూడి వద్ద రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ జబీన్, సర్పంచులు

దుగ్గిరాల, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా మూడు గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలకు తెర దించుతూ రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ, మానవవనరుల శాఖా మంత్రి లోకేశ్ నాడు తన ఎన్నికల ప్రచారంలో మూడు గ్రామాల ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.3.65 కోట్లతో 4.2 కి.మీ మేర రోడ్డు నిర్మాణంలో భాగంగా, గ్రామాల వెలుపల 2.2 కి.మీ మేర బీటీ రోడ్డు, గ్రామాల లోపల ప్రస్తుతం ఉన్న బీటీ రోడ్డు స్థానంలో 2 కి.మీ మేర సిమెంటు రోడ్డు వేయనున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిన మంత్రి నారా లోకేశ్‌కు ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు. కాగా 60 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్, పేరుకలపూడి ఎంపీటీసీ తాళ్ల అశోక్, సర్పంచ్ యార్లగడ్డ చంద్రదుర్గ, ఎంపీటీసీ మరీదు రాము, కొరిటాల సురేష్, కేసంనేని వాసుబాబు, యార్లగడ్డ చిన్న, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో బాలయ్య అభిమానులు పాల్గొనాలి

తుళ్లూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో ఈనెల 15న మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బాలకృష్ణ అభిమాన సంఘం తుళ్లూరు మండల అధ్యక్షుడు నెలకుదిటి చంద్రశేఖర్ (చందు) కోరారు. బుధవారం తుళ్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 15న మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కొత్తూరు సెంటర్ నుంచి ర్యాలీ బయలుదేరుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ హాజరై విగ్రహావిష్కరణ చేస్తారని అన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట రైల్వే గేట్ సమీపంలో రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం గుంటూరు రైల్వే పోలీసులు కనుగొన్నారు. ఆమె ఒంటిపై శనగపిండి రంగు చీర, కాఫీరంగు జాకెట్ ఉన్నాయని, వయస్సు 60-70 సంవత్సరాలు ఉంటాయని రైల్వే సీఐ అంజిబాబు తెలిపారు. ఎవరైనా మృతురాలి ఆచూకీ తెలిస్తే గుంటూరు రైల్వే పోలీస్ స్టేషన్ 9440627546 నెంబరులో సంప్రదించాలని సీఐ కోరారు.

వీఐటీలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ



వీఐటీలో ఒక రోజు నైపుణ్యాభివృద్ధి శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్డ్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎనిమిది మండలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 47 మంది ఉపాధ్యాయులకు ఒక రోజు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి నారా లోకేశ్ సూచనతో వీఐటీ దత్తత గ్రామాలైన శాఖమూరు, ఐనవోలు, వెలగపూడిలోని 5 ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ కోటారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా స్టార్స్ అనే పథకం ద్వారా రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రతిభావంతులైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివే ఒక విద్యార్థికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ద్వారా ఉచిత విద్యను అందిస్తున్నామని తెలియజేశారు. నూతన విద్యావిధానం 2020కు అనుగుణంగా విద్యార్థులకు విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కూడా తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని, అందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించిన జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకకు వీఐటీ రిజిస్ట్రార్ జగదీష్ ముదిగంటి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ (డీన్ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్డ్ సైన్సెస్)ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఫణికుమార్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

తుళ్లూరులో మహా పడిపూజ



అయ్యప్ప పడిపూజోత్సవంలో పాల్గొన్న స్వాములు

తుళ్లూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తుళ్లూరు శరణం అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. జమ్ముల వెంకటేశ్వరావు గురుస్వామి నేతృత్వంలో అయ్యప్ప మాలధారణ స్వాములు, భవానీలు, శివమాల, ఆంజనేయస్వామి మాలధారణ స్వాములు ఈ పడిపూజా మహోత్సవంలో అధికసంఖ్యలో పాల్గొన్నారు. అరటి తోరణాలతో పడిపూజకు మండపాలు ఏర్పాటు చేశారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేస్తూ భక్తిగీతాలను దప్పు శ్రీను స్వామి బృందం ఆలపించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నప్రసాదాలను భక్తులకు అందజేశారు.

శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ శ్రీదేవి

తాడికొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్వాసకోశ వ్యాధులు ఉన్న వ్యక్తులు శీతాకాలంలో అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ వీఎస్ఎస్‌వీ శ్రీదేవి అన్నారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో శ్వాసకోశ సమస్యలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ శ్వాస కోశ వ్యాధులు కేవలం శారీరక సమస్యలుగానే కాకుండా మానసిక ఒత్తిడిని కలిగిస్తాయని తెలిపారు. ఆస్తమా, సీఓపీడీ, న్యూమోనియో, ట్యూబర్‌కులోసిస్ వంటి సమస్యలను వైద్యంతో నయం చేయవచ్చునన్నారు. ఈ వ్యాధుల ప్రాథమిక లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. శ్వాసకోశ సమస్యల నివారణకు ఆరోగ్యకరమైన జీవన శైలి, మంచి ఆహారపు అలవాట్లు, పొగాకు వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత జీవనశైలిలో మార్పులు మాత్రమే కాకుండా, పరిసరాల శుభ్రత, సామాజిక బాధ్యతతో కూడా శ్వాసకోశ వ్యాధులను నియంత్రించవచ్చునని తెలిపారు. చికిత్సల్లో అత్యాధునిక విధానాలు, మల్టీ-డ్రగ్‌థెరపీ, ఆక్సిజన్ చికిత్స, శస్త్ర చికిత్సలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమకు రావలసిన న్యాయమైన బకాయిల కోసం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారంతో 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.కోటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు చేస్తామన్నారు. దీక్షల్లో ఎస్‌కే ఖాసిం, జోజప్ప, నాగేశ్వరరావు, యెహోషువ పాల్గొన్నారు.

తక్కెళ్ళపాడు రెవెన్యూ సదస్సుకు 40 అర్జీలు



తక్కెళ్ళపాడులో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జే ప్రసాదరావు

ఫిరంగిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలోని తక్కెళ్ళపాడులో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుంచి 40 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ జే ప్రసాదరావు అన్నారు. భూమి కొలతలు, పాసు పుస్తకాలకు సంబంధించి అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య ప్రాజెక్టు అధికారి వీ.శంకర్, దేవదాయశాఖ ఈవో జే శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ జేపీ శ్రీనివాసరావు, మండల సర్వేయర్లు జీ.వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్ అబ్దుల్ రెహ్మాన్, వీఆర్‌వోలు కే.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావిపాడులో..

పెదనందిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రావిపాడులో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా మాట్లాడుతూ ప్రభుత్వం భూసమస్యల పరిష్కారం కోసం రెండో విడత రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ సదస్సులో గతంలో భూ సమస్యలు తలెత్తిన రైతులు అర్జీల రూపంలో అందించాలని, వాటిని పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల భూ సమస్యలపై ఏడు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సాహితీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలభవన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సమావేశం



కమ్యూనిటి సమావేశంలో పాల్గొన్న బాలభవన్ ప్రతినిధులు, స్థానికులు

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి కరకట్ట వెంట ఉన్న డాన్ బాస్కో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బుధవారం క్లస్టర్ లెవల్ లోకల్ యాక్షన్ కమిటీ సమావేశం తాడేపల్లి ఎస్టి కమ్యూనిటి హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజర్ ఎండీ వసంతకుమారి మాట్లాడుతూ కమ్యూనిటిలో ఎదుర్కొనే సమస్యల గురించి, పిల్లల స్కూలుకు వెళ్లకపోవడం లేదా బాల్య వివాహాలు జరగడం బాలల హక్కుల ఉల్లంఘన అవుతుందన్నారు. ఎస్ఎల్ ఫోర్స్ రాజు మాట్లాడుతూ పిల్లలపై జరుగుతున్న హత్యాచారాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ కె.రాంబాబు, కె.రవీంద్రబాబు, ఏఎన్ఎం జయసుధ, ఆశా వర్కర్ విజయలక్ష్మి, డీబీ లెర్నింగ్ సెంటర్ స్కూల్ టీచర్స్ ఆశ, రమ్య, పావని శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల పెరుగుదలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నవరపు ప్రభాకర్‌రావు

మంగళగిరి సిటీ, డిసెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరల పెరుగుదలను అరికట్టాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించడం నిలిపివేయాలని సీపీఐ పట్టణ ఇన్‌చార్జి కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో బుధవారం పట్టణ కమిటీ సమావేశం నందం బ్రహ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం లోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల చొప్పున పేదలకు ఇవ్వాలని, గత ప్రభుత్వ హయాంలో అదానీ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన సీపీఐ శత వసంతాల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నేతు చిన్ని తిరుపతయ్య, మోహనరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్ అండ్ బీ రహదారి



గుంటూరు - అనంతవరప్పాడు ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితి

వట్టిచెరుకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టి గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దాలని ఆదేశించినా ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం మాకు అది వర్తించదన్నట్టుగా ప్రవర్తిస్తున్నారు. ఏటుకూరు బైపాస్ రోడ్డు నుంచి అనంతవరప్పాడు గ్రామం వరకు గుంతలు పూడ్చేందుకు తోలిన మెటల్ ఎక్కడికక్కడ వదిలి వేయటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రాత్రి సమయంలో పలువురు రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. అప్పటి వరకు గుట్టలుగా పోసిన మెటల్‌ను రోడ్డుపై పరచి ఎలాంటి మరమ్మతులు చేయకుండా వదిలి వేశారు. దీంతో ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులకు గుంతలతో ప్రమాదాల కంటే ఈ మెటల్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తక్షణమే రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కేఎల్‌యూలో ఎన్‌సీసీ విస్తృత స్థాయి సమావేశం



ఎన్‌సీసీ సమావేశంలో పాల్గొన్న ఏపీ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మధుసూదనరెడ్డి తదితరులు

తాడేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఎన్‌సీసీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమాండర్ పి. మధుసూదనరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్‌సీసీ ముఖ్యమని, శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు విస్తృతంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంజీవ్ గుప్తా, రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ అధికారులు, ఆయా పాఠశాలలు, కళాశాలల నుంచి అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కేఎల్‌యూ డీన్‌లు కేఆర్ఎస్ ప్రసాద్, హబిబుల్లాఖాన్‌లు హాజరయ్యారు.

ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం చర్యలు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న జానకీదేవి, టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గ ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి అన్నారు. మంగళగిరిలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బుధవారం అందజేశారు. పట్టణంలోని 25వ వార్డు హౌస్పేట్‌కట్ట ప్రాంతానికి చెందిన కందుల వీరరాఘవులుకు రూ.30,786, రెండో వార్డుకు చెందిన కడియం హనుమంతరావు కుమారుడు సుజయివాన్‌కు రూ.45,084 చొప్పున అందించారు. 26వ వార్డుకు చెందిన షేక్ మీరాబీ గుంటూరులో విజయ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ముందస్తు చికిత్స చేయించుకోవడానికి మంజూరైన రూ.60 వేల ఎల్‌వోసీ చెక్కులను ఆమె ఇంటికి వెళ్లి అందజేశారు. జానకీదేవి మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులకు వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నేతలు షేక్ సుభానీ, రంగిశెట్టి నరేంద్ర (బాబీ), సుఖమంచి గిరిబాబు, మల్లేశ్వరి, ఉద్దంటి గాంధీ, చిరంజీవి, షేక్ సలీమ్, హజరత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

శాంతిదూత మినిస్ట్రీస్‌లో క్రిస్మస్ ఉత్సవాలు



శాంతిదూత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందం అబద్దయ్య తదితరులు

మంగళగిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి సైమన్ మెమోరియల్ ప్రేయర్ హాలులోని శాంతిదూత మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఉత్సవాలు, నూతన సంవత్సర స్వాగతారాధనలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. జనవరి ఒకటో తేదీ వరకు ఇవి కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ కే శకుంతల ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. లిటిల్ సిస్టర్స్ ఆఫ్ ది పూర్ సంస్థ నిర్వాహకులు జుడిత్, విక్టోరియా జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. క్రైస్తవ ఆధ్యాత్మిక రంగ ప్రముఖులు ప్రొఫెసర్ కొడాలి విజయ్ కుమార్, మిషన్ ఆఫ్ జాయ్ ఫౌండర్ జోసెఫ్ కొదమల, నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేకే రవికుమార్, సైమన్ మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి నోవా సైమన్, శాంతిదూత మినిస్ట్రీస్ అధ్యక్షుడు రూపస్ పాల్గొన్నారు.

రేటూరులో నీటి వినియోగదారుల ఎన్నికలు

కాకుమాను, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 332 నీటి వినియోగదారుల ఎన్నికలు శనివారం జరగనున్న నేపథ్యంలో బుధవారం ఎలక్షన్ ఆఫీసర్ కిరణ్మయి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు. అప్పాపురం, రేటూరు, కొండపాటూరు, పర్చూరు మండలం చెరుకూరు కార్యదర్శులు ఈ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తారని ఎలక్షన్ ఆఫీసర్ కిరణ్మయి చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరాంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్‌కు సంబంధించిన ప్రతులను బుధవారం ఎంపీడీవో, తహసీల్దార్, ఆయా సచివాలయాల వద్ద అధికారులు ప్రచురించారు. ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తామని, మండలంలో రెండు గ్రామాల్లో ఎన్నికలు జరుగుతాయని, ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలి

● మాజీ మంత్రి అంబటి

మేడికొండూరు డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): రైతులు నుంచి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయాలని పలువురు వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, తాడికొండ, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్తలు వనమాబాల వజ్రబాబు, నిమ్మకాయల రాజనారాయణ బుధవారం మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం గ్రామంలోని వరి రైతులను పరామర్శించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. అనంతరం రైతు ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కందుల సిద్దయ్య, వైసీపీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, గ్రామ సర్పంచ్ శ్రీదేవి సాంబిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

పొన్నూరు ఎంఈవోగా చలపతిరావు బాధ్యతల స్వీకారం

పొన్నూరు టౌన్, డిసెంబరు 11: పొన్నూరు మండల విద్యాశాఖ అధికారిగా ఆర్.చలపతిరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చేబ్రోలు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న చలపతిరావు పదోన్నతిపై పొన్నూరు ఎంఈవోగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన చలపతిరావును ఎంఈవో కార్యాలయ సిబ్బంది, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

నిలిచిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణం

- 9.50 కోట్ల రూపాయలతో ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం
- 2018లో తొలివిడత రూ.80.50లక్షలు మంజూరు
- చంద్రబాబునాయుడు కాలనీలో నిర్మాణానికి శ్రీకారం
- ప్లాంట్ నిర్మాణంపై స్థానికులు కోర్టుకు.. స్టేతో నిలిచిన పనులు
- తుప్పుపట్టిపోతున్న ఇనుప చువ్వలు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా
- అందుబాటులోకి వస్తే వందలాది ఎకరాలకు సాగునీరు
- అధికారులు చొరవ చూపాలని ప్రజాసంఘాల విన్నపం



నిలిచిన పనులతో తుప్పు పట్టిన ఇనుప చువ్వలు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలతో పట్టణంలోని మురుగునీరుని స్వచ్ఛ నీరుగా మార్చేందుకు నిర్మాణం ప్రారంభించిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ పనులు మధ్యలో ఆగిపోయాయి. 2018లో అప్పటి కౌన్సిల్‌లో రూ.9.50కోట్లతో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను చంద్రబాబు నాయుడు కాలనీలో ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. దానికి గాను మెసర్స్ అయ్యప్ప ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ వారికి తొలి విడతగా రూ.80.50 లక్షలు మంజూరు చేశారు. పనులు ప్రారంభమై బేస్‌మెంటు వరకు చేరాయి. సిమెంటు, స్టోన్, కాంక్రీట్, ఐరన్ (ఇనుప చువ్వలు) వంటి వాటిని ప్లాంట్‌కి ఇంజనీరింగ్ ప్లానింగ్ ప్రకారం బేస్‌మెంటు వరకు చేరాయి. ప్లాంట్ పనులు సాగే క్రమంలో స్థానికులు ప్లాంట్ ఏర్పాటు అయితే పెద్దఎత్తున మురుగు శుద్ధి అయ్యే క్రమంలో దుర్వాసన వస్తుందని, తమకు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తంచేయడంతో పనులు నిలిచిపోయాయి. తిరిగి కొన్ని రోజులకు పనులను ప్రారంభించడంతో స్థానికులు కొందరు కోర్టును ఆశ్రయించారు. దీనితో నిర్మాణ పనులపై కోర్టు స్టే విధించడంతో శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు బేస్‌మెంట్ స్థాయిలో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో మురుగు నీరుతో బేస్‌మెంట్ లెవల్ మునిగి దానికి వాడిన ఐరన్ (ఇనుప చువ్వలు) తుప్పుతో నాణ్యత దెబ్బతింటూ లక్షల రూపాయలు నిరుపయోగంగా మారాయి. అధికారులు సైతం కోట్ల రూపాయిల ప్రజాధనం నిరుపయోగంగా మారుతున్నా నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడంతో పలు ప్రజాసంఘాల నాయకులు అధికారుల తీరును ఎండగడుతున్నారు. ఆ ప్లాంటు పనులు పూర్తయి అప్పటి నుంచి కొనసాగి ఉండి ఉంటే లక్షల లీటర్ల మురుగునీరు శుద్ధి అయి దాని ద్వారా రైతులకు సాగునీరుతో పాటు పంట భూములకు, స్థానిక నివాస ప్రాంతాలు కలుషితమౌకుండా మంచి జరిగి ఉండేది. ఆ ప్లాంట్ నిర్మాణానికి ముందే స్థానిక ప్రజలతో సమావేశాలు ఏర్పాటుచేసి ప్లాంట్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కలిగించి ఉంటే ప్లాంట్ నిర్మాణ పనులు సజావుగా జరిగేవని, ముందుగా సమావేశాలు జరిపితే అభ్యంతరాలుంటే ప్లాంట్ పనులు ప్రారంభించక పోయినా లక్షల రూపాయలు మిగిలిలేవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ పనులు కోర్టులో ఉందన్న సాకుతో మున్సిపల్ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ప్లాంట్ పరిస్థితి మిగిలిపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దానిపై దృష్టిపెట్టి స్థానికులతో ప్లాంట్ ఏర్పాటైతే జరిగే మంచిని వారికి వివరించి ఎవరైనా అభ్యంతరాలు తెలిపితే వారి అభిప్రాయాలను గౌరవించి సమస్య ఉత్పన్నం కాకుండా తీసుకోవలసిన చర్యలపై భరోసాని కల్పించి, ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు (విద్య), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలిలోని ఐటీఐ కళాశాల, నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పది నుంచి పీజీ వరకు విద్యార్హతలు ఉండి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న యువతీ, యువకులు అర్హులని తెలిపారు. బయోడేటా విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపండి: శాస్త్రవేత్త రత్నం

తెనాలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన ఆహార పంటలు పండించేలా రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ రత్నం అన్నారు. బుధవారం మండలంలోని ఎరుకలపూడి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో ప్రేమసాగర్‌తో కలిసి డాక్టర్ రత్నం పాల్గొన్నారు. తొలుత కోత దశలో ఉన్న వరి పంటలను పరిశీలించి రబీ సీజన్‌లో సాగుచేపట్టబోయే జొన్న, మొక్కజొన్న పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎరువుల తయారీ దానిని పిచికారి చేసే విధానంపై డాక్టర్ రత్నం రైతులకు అవగాహన కల్పించారు. ఏవో ప్రేమసాగర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని దళారులను నమ్మి రైతులు తక్కువ ధరలకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. రబీ సీజన్‌కుగానూ పంటల ఇన్సూరెన్స్ ప్రీమియంను డిసెంబరు 15వ తేదీలోపు రైతులు కామన్ సర్వీస్ సెంటర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుపులేటి సామ్రాజ్యం, వీఏఏ పి.మణిదీపిక, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, విజయలక్ష్మి, రమణ, రత్నకుమారి, మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

14న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

తెనాలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి తెలిపారు. శనివారం ఉదయం 10.30 నుంచి మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగనుందన్నారు. సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సర్పంచ్‌లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

ఆలయాల పవిత్రతను కాపాడుకుందాం

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



వీరాంజనేయ స్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 11: ఆలయాల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం శ్రీవీరాంజనేయస్వామి, సహస్రలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఏసీ వసతి గదులను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన నరేంద్ర కుమార్‌కు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆలయ ఆదాయ వ్యయవివరాలను అందచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ధ్వజస్తంభాలకు సంబంధించిన వంద కిలోల ఇత్తడి మాయమైన సంఘటనపై వివరణ కోరారు. ఆలయంలో అదృశ్యమైన ఇత్తడి వ్యవహారంలో విచారణ జరపాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాయాలని ఈవోకు సూచించారు. అలాగే వీరాంజనేయ స్వామికి కేవలం వారంలో ఒక రోజు మాత్రమే ఎందుకు అభిషేకాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈవో మాట్లాడుతూ 2022లో పాలకవర్గ తీర్మానం ప్రకారం ఒకరోజే అభిషేకాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే గత ఐదేళ్ల కాలంగా ఆలయానికి భక్తులు ఇచ్చిన విరాళాల వివరాలు అందచేయాలని కోరారు. విరాళాల రిజిస్టర్ ఎందుకు ఏర్పాటు చేయలేదోనని ప్రశ్నించారు. వీటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరిన వివరాలు అన్నీ సిద్ధం చేయాలన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆలయాల ప్రతిష్ఠను మంట కలిపారని ధ్వజమెత్తారు. ఇటీవల మాజీ ప్రజా ప్రతినిధి వడ్లమూడి క్వారీ దేవాలయానికి ఆలస్యంగా వెళ్లి అయన వచ్చే వరకు దేవుడికి నైవేద్యం పెట్టనివ్వలేదని దుయ్యబట్టారు. పెదకాకాని శివాలయంలో కూడా అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు. దేవాలయాల ప్రతిష్ఠను కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని నరేంద్ర కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో ఈవో గద్దె అమర్నాథ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణ పరిశుభ్రతకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం పట్టణంలోని 31వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన నిర్మాణాలు చేసే భవన యజమానులు డ్రెయిన్‌లో, కాలువలలో ఇసుక, కంకర వంటి వ్యర్థాలు చేరకుండా చూడాలని, వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. అవి కాలువలలో చేరడంతో మురుగునీటి పారుదలకు అంతరాయం ఏర్పడి ఆ నీరు రహదారులపైకి చేరుతున్నాయన్నారు. ప్రజల సహకారంతోనే సుందర తెనాలి సాకారవుతుందని రాధిక అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

16వ వార్డులలో...

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 16వ వార్డు నుంచి 23వ వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి ఇంటి నుంచి చెత్తను పారిశుధ్య కార్మికులు సక్రమంగా సేకరిస్తున్నారో లేదా అన్న విషయాన్ని తెలుసుకోవడంకోసం ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నామన్నారు. చెత్తను సేకరించడానికి పుష్‌కాట్‌లను, టబ్బులను, సేకరించిన చెత్తపోయడానికి బీన్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. పెరుగు మార్కెట్ వద్ద ఉన్న పబ్లిక్ టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగర దీపికలు శానిటేషన్ సిబ్బందితో కలసి ప్రతి రోజు ఇంటింటి నుంచి చెత్త సేకరించే వివరాల రిజిస్టర్‌లను కమిషనర్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లోన్ యాప్‌లతో మోసపోకండి

● పట్టణ డీఎస్పీ జనార్ధనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ యాప్‌లతో సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోవద్దని పట్టణ డీఎస్పీ జనార్ధనరావు అన్నారు. స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద బుధవారం త్రీటౌన్ సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని త్రీటౌన్ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ జనార్ధనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు బాగా పెరిగాయన్నారు. మరి ముఖ్యంగా యువతను టార్గెట్ చేసుకొని ఆన్‌లోన్ యాప్‌లు ద్వారా లోన్ ఇస్తామని చెప్పి ఓటీపీలు చెప్పాలని చెప్పి వారి అకౌంట్‌లోని నగదును తస్కరిస్తున్నారన్నారు. వాటిని తిరిగి చెల్లించాలని వేధిస్తూ, వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తుంటే వీరి వేధింపులు భరించలేక కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. వాట్సప్‌లో వచ్చే తెలియని లింక్‌లను ఓపెన్ చేయవద్దని, ఇతర ఇంటర్నేషనల్ కాల్స్‌ను అటెండ చేయవద్దని సూచించారు. మరికొంతమంది సైబర్ నేరగాళ్లు పోలీసులమని బెదిరింపులకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్‌కాల్స్ వస్తే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ ప్రకాశరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 725 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 223 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 78, పశ్చిమ కాల్వకు 53, నిజాంపట్నం కాల్వకు 143, కొమ్మమూరు కాల్వకు 1245 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సంజన సిన్హ, కమిషనర్ శేషన్న తదితరులు

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తాం

● సబ్ కలెక్టర్ సంజనసిన్హ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డు కారణంగా రైతుల భూములు బీడు భూములుగా మారుతున్నాయని వచ్చిన ఫిర్యాదుపై త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి రైతులకు మంచి జరిగేలా చూస్తామని సబ్ కలెక్టర్ సంజనసిన్హ చెప్పారు. డంపింగ్ యార్డులో వ్యర్థాలతో పక్కనే ఉన్న పంట పొలాలలోకి చేరడంతో భూములు బీడులవుతున్నాయన్న ఫిర్యాదుపై బుధవారం బుర్రిపాలెం రోడ్డులోని డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ శేషన్నతో కలసి పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా యార్డులో కొండను తలపిస్తూ పేరుకుపోయిన వ్యర్థాలను పరిశీలించి, వాటిని తగులబెట్టడం వల్ల కలుషితమౌతున్న విధానంపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్చి నెలాఖరులోపు వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తామని కమిషనర్ శేషన్న తెలిపారన్నారు. త్వరలోనే రైతుల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ సంజనసిన్హ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాజీ బాబా దర్గాను సందర్శించిన కేంద్ర మైనార్టీ కమిషనర్ సభ్యురాలు



పెదకాకాని దర్గాను సందర్శించిన నేషనల్ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది

పెదకాకాని, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): నేషనల్ మైనారిటీ కమిషన్ మెంబర్ సయ్యద్ షహజాదీ పెదకాకానిలోని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా బాబా దర్గాను బుధవారం సందర్శించారు. షహజాదీని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి మహబూబ్ షరీఫ్, వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్, దర్గా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ ముక్తియార్ భాషాలు దర్గా మర్యాదలతో స్వాగతం పలికారు. దర్గాలోని బాబా అవులియాకు ఛాదర్‌ను బహూకరించారు. అనంతరం దర్గా ఈవో కార్యాలయంలో పెదకాకాని మండల టీడీపీ మండల అధ్యక్షుడు మురళి, మైనారిటీ అధ్యక్షుడు మౌజన్‌లు దర్గాను సందర్శించే యాత్రికులకు వసతి, భోజనం షెడ్‌లు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించాలని సయ్యద్ షహజాదీని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



లబ్ధిదారులకు రిలీఫ్ ఫండ్ చెక్ అందచేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

చేబ్రోలు, డిసెంబరు11: మండల పరిధిలోని గొడవర్రు గ్రామానికి చెందిన పసుపులేటి భీమరాజుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 37,205 నగదును చెక్కును బుధవారం ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అందచేసారు. అనారోగ్యం బాధితులను ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం అందచేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పూజా మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

పొన్నూరు టౌన్, డిసెంబరు11: మండల పరిధిలోని మామిళ్లపల్లిలో బుధవారం అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం భక్తి శ్రద్ధలతో జరిగింది. మండల తెలుగు యువత అధ్యక్షుడు మొవ్వ వెంకట కృష్ణ గృహంలో జరిగిన ఈ పడి పూజా మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు రాష్ట్ర నాయకులుగా తయారవ్వాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, సింహాచలం

పెదకాకాని, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించేలా ఎదగాలని ఎమ్మెల్సీ కేసు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. నాగార్జున యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఏపీ పీజీ సెట్ యూనివర్సిటీ డిపార్టుమెంట్స్‌లో ఫస్ట్ ర్యాంక్ వచ్చిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కే.రూఫస్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీలో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకున్నానని నేటి విద్యార్థులు కూడా అధ్యయనం విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు పోటీ పరీక్షలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆచార్య శివరామ్ ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కార్యదర్శి కే.నవీత, ఆర్ట్స్ కాలేజీ ప్రెసిడెంట్ ఉపేంద్ర, ఉపాధ్యక్షుడు అజయ్, నాయకులు ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

చర్మ సంరక్షణపై జాగ్రత్తలు వహించండి

● చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ అంకినీడు ప్రసాద్





తెనాలి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో చర్మసంరక్షణకు జాగ్రత్తలు వహించాలని జిల్లా ప్రభుత్వ వైద్యశాల చర్మవ్యాధుల నిపుణుడు డాక్టర్ పి.అంకినీడు ప్రసాద్ సూచించారు. శీతాకాలంలో చర్మవ్యాధులు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతికి తెలిపిన వివరాలు.

ప్రశ్న: చలికాలంలో ఎటువంటి చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంది?

జవాబు: చలికాలంలో ఎగ్జిమా (తామర), సోరియాసిస్, దద్దుర్లు, పెదాలు, కాళ్లు పగలడం వంటివి ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

ప్రశ్న: ఈ సీజన్‌లో చర్మ సమస్యలతో వచ్చే వారిలో ఎటువంటి లక్షణాలు కనిపిస్తాయి?

జ: పొడిదురద, ఎర్రబడిన చర్మం, చర్మం పొరలుగా ఏర్పడి పొలుసులు ఊడటం, దద్దుర్లు, దురదతో కూడిన ఎరుపు చర్మం, రింగ్‌లుగా ఎర్రటి చర్మం వంటి చర్మవ్యాధుల లక్షణాలతో ఎక్కువగా వస్తుంటారు.

ప్రశ్న: వీరికి ఎటువంటి చికిత్స అందిస్తారు?

జ: వ్యాధి లక్షణాలను పరీక్షించి అనంతరం దురద వంటి వాటి ఉపసమనానికి మెడిసిన్, ఆయింట్‌మెంట్, అలెర్జీ లక్షణాలకు వ్యతిరేకంగా పోరాడేలా యాంటీ హిస్టామినిక్స్ వంటి మందులను చికిత్సకు ఉపయోగిస్తాం. సోరియాసిస్ వంటి వ్యాధులకు మందులు తరుచుగా వాడాల్సి ఉంటుంది.

ప్రశ్న: చర్మవ్యాధుల బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జ: చర్మం పొడిబారుతున్నట్లు ఉంటే కొబ్బరినూనెను రాసుకోవడం, తగినన్ని తాగునీరు లేదా ఫ్రూట్ జ్యూస్, కొబ్బరినీళ్లు వంటివి తీసుకోవడం, చర్మసంరక్షణకు లోషన్ లేదా జెల్, మాయిశ్చరైజర్లు వంటివి వాడుకోవడం, విటమిన్ ఇ, ఏ, సీ అధికంగా ఉండే పండ్లు ఇతర ఆహారాలను తీసుకోవడం వంటివి చేయడం ద్వారా చర్మవ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు వహించవచ్చు.

ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● మండల వైద్యాధికారి లక్ష్మీసుధ



వల్లభాపురంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న మండల వైద్యాధికారి లక్ష్మీసుధ

కొల్లిపర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకోవాలని మండల వైద్యాధికారి లక్ష్మీసుధ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వల్లభాపురంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నీటిని అధికంగా తీసుకోవడం మంచిదన్నారు. నిల్వఉన్న ఆహార పదార్థాలను తీసుకోకూడదన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ సరళ, ఏఎన్ఎం జ్యోతి, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ మల్లేశ్వరరావు, ఆషా కార్యకర్తలు కృష్ణకుమారి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి: అంబటి

చేబ్రోలు, డిసెంబరు 11: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని శలపాడులో పంట పొలాలను పరిశీలించి ఆరబోసిన ధాన్యంను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయటంలో శ్రద్ధ చూపటం లేదని ఆరోపించారు. రైతులు ధాన్యం అమ్ముడుపోక దళారులతో ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ, నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈవోపీఆర్డీ భార్గవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ఆర్థిక ప్రణాళికలో పొందుపర్చాలన్నారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. గ్రామ పంచాయతీలకు మంజూరైన నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పలు అంశాలపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ అవుతు సాంబిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి, మేనేజర్ విజయకుమారి, టీఈ రవికాంత్ తదితరులు

ఎస్‌హెచ్‌జీ సర్వేను పూర్తిచేయండి

● మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైలింగ్ సర్వేను ఈ నెల 15వ తేదీలోపు పూర్తిచేయాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలోని మెప్మా విభాగంలో మెప్మా యాక్టివిటీస్‌పై రివ్యూ మీటింగ్‌ను మెప్మా అధికారులు ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల ప్రొఫైలింగ్, ఎంఎస్‌ఎంఈ సర్వేలను నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని ఆర్పీలను ఆదేశించారు. రివ్యూ మీటింగ్‌లో పలు అంశాల గురించి చర్చించారు. స్వయం సహాయక గ్రూపులకు ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో మెప్మా టీఈ జె రవికాంత్, సీఎంఎం జి.విజయకుమారి, ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలు పాల్గొన్నారు.